'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి	శుక్రవారం	31.07.2026	సంపుటి: 3	సంచిక: 179	పేజీలు : 8	వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI	FRIDAY	31.07.2026	VOLUME : 3	ISSUE : 179	PAGES: 8	COST: 2/-

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కన్నుమూత

హైదరాబాద్, రాజ ముద్ర న్యూస్: బీఆర్ఎస్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటల కు కన్నుమూశారు. ఈ మేరకు సికింద్రాబాద్ యశో ద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తర లించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక.. కొంత ఫలితం కని పించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ లోని యశోద ఆసుప త్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్పై ఉంచి చికిత్స ఆరంభించారు. 5 రోజుల అనంతరం ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు.

సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి

- రిజర్వాయర్లలో నీటిని తాగునీటికి వినియోగించాలి
- ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి
- వ్యవసాయ మంత్రి తుమ్మల

3

3

ఎగుమతుల వృద్ధికి కార్యాచరణ రూపొందించాలి

- ఎగుమతులకు అనుకూలమైన విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి
- పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ
- డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో మంత్రి పొంగులేటి టెలికాన్ఫరెన్స్

3

నాణ్యమైన విద్య అందించేందుకు
దీక్షబూనండి

- మండలం యూనిట్‌గా ప్రణాళికలు పంపండి
- ప్రతీ పిల్లవాడు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా పనిచేయాలి
- మీ పర్యటన అనుభవాలు విద్యార్థులకు మేలు చేయాలి
- విదేశీ విద్యకు ఏటా 10-15 మంది ఉపాధ్యాయుల ఎంపిక
- సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు
- ఉపాధ్యాయులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 30 : నాణ్యమైన విద్య రాష్ట్రానికి పునాది అయితే,నైపుణ్యాలు అంతస్తుల్లాంటివని ము ఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రానున్న ఐదేళ్లు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవా లని సూచించారు. టీచర్ ఇంటర్నేషనల్

మిగతా 2వ పేజీలో..

100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు

- మూడు విడతల్లో ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిల విడుదల పూర్తి చేసిన తెలంగాణ ప్రభుత్వం
- 100 రోజుల్లో మొత్తం రూ.6,000 కోట్ల బకాయిలు విడుదల
- ఉద్యోగ జేఏసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు

2

కూరగాయల సాగును ప్రోత్సహించండి

2

వందేమాతరం గీతానికి
పార్లమెంట్ ఆమోదం

- లోక్‌సభలోనూ ఆమోదం పొందిన బిల్లు

న్యూదిల్లీ, జూలై 30: వందేమాతరం గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించే బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లుకు లోక్‌సభ కూడా తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో త్వరలో ఇది చట్ట రూపం దాల్చనుంది. ప్రతిపక్షాల నిరసనల నడుమ లోక్‌సభ నేడు మూజువాణి ఓటుతో

మిగతా 2వ పేజీలో..

రాజ్యసభకు ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

- లీకులపై కఠిన చర్యల కోసమే బిల్లు అని చెప్పిన మంత్రి
- విద్యార్థులపై లాఠీఛార్జ్‌పై అమిత్ క్షమాపణలు చెప్పాలన్న ఖర్గే

న్యూదిల్లీ,జూలై30: ప్రశ్నపత్రాల లీకేజీ నిరోధానికి ప్ర భుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ పరీ క్షల (అనుచిత పద్ధతుల నివారణ) సవరణ బిల్లు 2026' రాజ్యసభ ముందుకు వచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని సభలో ప్రవేశపెట్టారు. దీనిపై

మిగతా 2వ పేజీలో..

పదవిలో ఉన్నా సామాన్యుడిలా కోర్టుకు హాజరు

- ఆదర్శంగా నిలిచిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూలై 30 : న్యాయస్థానాలు, చట్టం పట్ల అపారమైన గౌరవాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి వి క్రమార్క చాటుకుని ఆదర్శంగా నిలిచారు. నాటి కొత్తగూడెం బీఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు(రాఘవ)

మిగతా 3వ పేజీలో..

ఇంజనీరింగ్ విద్యార్థులను 'క్రిమినల్ వేస్ట్' అంటావా?

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలి
- 32 నెలలైనా ఓపీఎస్, ఆరు నెలల్లో ఇస్తామన్న పీఆర్సీ ఏదీ?
- ప్రశ్నించే గొంతుకలపై ఏసీబీ, సీఐడీలతో అక్రమ కేసులు..
- ఉద్యోగులకు అండగా బీఆర్ఎస్.. ఎవరూ భయపడొద్దు
- మాజీ మంత్రి హరీష్ రావు

2

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులకు పెద్దపీట

- జాప్యం లేకుండా పాలు, బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయాలి
- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 30 : రాష్ట్రంలోని ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపా యాలు అందుబాటులోకి వాలని అధికారులను మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క

మిగతా 3వ పేజీలో..

నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

పెద్దపల్లి, జూలై 30 : కాళేశ్వరం ప్రాజెక్టు అనుబంధ లింక్ 2 ఎల్లం పల్లి ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. నీటిపారు దల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం నుంచి ఇక్కడి పంపు హౌస్ నుంచి నీటి ఎత్తిపోతల పక్రియ మొద లుపెట్టిన విషయం తెలిసిందే. గురువారం కూడా నీటి ఎత్తిపోతలు కొనసాగాయి. 1,4,5,6 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో మోటార్

మిగతా 3వ పేజీలో..

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు
- మేడిగడ్డ వద్ద వరద ఉధృతితో 85 గేట్లు ఎత్తివేత..
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు పెరిగిన వరద ఉధృతి
- కడెం జలాశయానికి భారీగా వరద నీరు చేరిక
- ములుగు జిల్లా బొగత జలపాతం సందర్శన నిలిపివేత

3

కూరగాయల సాగును ప్రోత్సహించండి

- సెంట్రలైజ్డ్ కిచెన్స్ పరిసర ప్రాంతాల్లో దృష్టి పెట్టండి
- ఆర్గానిక్ సాగు దిశగా రైతులకు అవగాహన కల్పించండి
- నిపుణుల కమిటీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నివేదికను అందజేసిన కమిటీ

హైదరాబాద్, జూలై 30:

రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ నుంచి ఎక్స్‌టెన్షన్ అధికారులను నియమించి సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్ నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం సమర్పించింది. నివేదికలో కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాక వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని తెలిపింది. గ్రామాలవారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి ప్రత్యామ్నాయ పంటలు పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. 75శాతం సబ్సిడీతో ఈ పంటలకు సంబంధించిన విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది. గత ఏడాది ఈ సీజన్ లో 79.49 లక్షల ఎకరాలు సాగవగా, ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాలు మాత్రమే సాగయ్యాయని పేర్కొంది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3.62 లక్షల ఎకరాలు, వరి 14.92 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో తెలిపింది. ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింకర్ల సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించి పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం నిరంతర విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రోత్సహిస్తూ రైతు బజార్లకు రవాణా సౌకర్యం కల్పించాలని నివేదికలో పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డెయిరీ యూనిట్లను స్థాపించేందుకు ఆర్థిక సహాయం అందించాలని, అత్యవసర చర్యల అమలును పర్యవేక్షించేందుకు గ్రామస్థాయి బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్ లో డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వర్షా లతో రైతులకు ఊరట

మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేసి నట్లు చెప్పారు.

నాణ్యమైన విద్య అందించేందుకు దీక్షబూనండి

మొదటిపేజీ తరువాయి

ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛాంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్‌లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు వ్యయం చేస్తున్నామని, అంత ఖర్చు చేస్తున్నా విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ఎందుకు వెళుతున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణలో ప్రపంచస్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామని తెలిపారు. ఆయా దేశాల పర్యటనతో తెలుసుకున్న అంశాలను ఇక్కడ విద్యార్థులకు బోధించి ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమాజం కోసం, తరతరాల భవిష్యత్తును మార్చేందుకు అయిదేళ్లపాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేయాలని కోరారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమని తాము నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే తేల్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఎకరాల కొద్ది భూమి, ఇతర ఆస్తులు ఉన్నా సమాజం ఎటు వెళుతున్నదో తెలియక వెనుకబడి పోతున్నారని, ఏ ఆస్తులు లేకపోయినా చదువుతో ఉద్యోగాలు సాధించిన వారు ప్రపంచంతో పోటీ పడుతున్నారని తెలిపారు. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతోనే బ్రేక్‌ఫాస్ట్ స్కీంకు రూపకల్పన చేశామని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చాక హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచామన్నారు. 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇచ్చామని సీఎం గుర్తు చేశారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మాదిరే ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తామని తెలిపారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, విద్యార్థుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలు తనతో కొట్లాడాలని సూచించారు. ఉపాధ్యాయులు ఏ మండలానికి ఆ మండలం యూనిట్‌గా తీసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. ఆ మండలంలోని పాఠశాలల్లో ఏ వసతులు కావాలి, ఎంతమంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు ఏమి అవసరమనే అంశాలు ఆ ప్రణాళికలో ఉండాలని సూచించారు. డిసెంబరు ఆఖరుకు ఆ ప్రణాళిక అందజేస్తే దానికి అనుగుణంగా తాము కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి ప్రత్యేక వెబ్‌సైట్ రూపొందించాలని అధికారులను ఆదేశిస్తూ ఆయా సూచనలు, సలహాలను అందులో పొందుపర్చాలన్నారు.

విద్యపై ఎంత ఖర్చుకైనా వెనుకాడం

తమ ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులకు మొదటి తేదీనే వేతనాలు అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందజేస్తున్నామని తెలిపారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు ఉన్న సమాజం, దేశమే అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులు రోజులో అధిక సమయం పాఠశాలల్లోనే ఉంటారు కనుక వారికి మానవ సంబంధాల ప్రాధాన్యతను తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని అన్నారు. విద్య నైపుణ్యం కాదని, విద్యతోపాటు నైపుణ్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భాష సమాచార మార్పిడికి ఉపయోగపడుతుందని, నైపుణ్యం జీవనోపాధి కల్పిస్తుందని అన్నారు. చైనా, జపాన్, కొరియా, జర్మనీ దేశాల్లో ఇంగ్లీష్ మాట్లాడే వారు 10 శాతం మించి ఉండరని, కానీ వారికున్న నైపుణ్యంతో ప్రపంచాన్ని శాసిస్తున్నారని తెలిపారు. జపాన్, జర్మనీ, కొరియా భాషలు కొంత నేర్చుకుని నైపుణ్యాలు నేర్చుకుంటే అక్కడ మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, దాన్ని పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నిరక్షరాస్యత, కరవుకాటకాలతో దేశం సతమతమవుతున్నప్పుడు ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదల రంగాలను ప్రాధాన్యతాంశాలు గా ఎంచుకుని ఆ సమస్యలను అధిగమించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఐఐటీలు, ఐఐఎంలు, యూనివర్సిటీలు, సాగు నీటి ప్రాజెక్టులు నెహ్రూ దార్శనికతకు నిదర్శనమన్నారు. నాడు వేసిన పునాదులతో నేడు ప్రతి తండా, గూడెంలోనూ పాఠశాలలు ఏర్పాటయ్యాయని, ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. సాంకేతిక విప్లవంతో వైట్ కాలర్ జాబ్‌లను మనం అందిపుచ్చుకున్నామని, కానీ ఇప్పుడు వాటికి కాలం చెల్లిందని అన్నారు. జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల్లో నైపుణ్యాలకు డిమాండ్ ఉన్నందున అక్కడి అవసరాలకు తగినట్లు మన విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే సంప్రదాయ కోర్సులతో ప్రభావం కోల్పోయిన ఐటీఐలను టాటా సంస్థ సహకారంతో ఏటీసీలుగా ఆధునీకరించామని, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. ఉట్నూరు ఏటీసీలో శిక్షణ పొందిన వారంతా టాటా సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని సీఎం తెలిపారు.

సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన వారిపై విమర్శలా?

కరవు, కాటాకాలు, నిరక్షరాస్యతలో కూరుకుపోయిన దేశాన్ని సాగు నీటి ప్రాజెక్టులు, విద్యాలయాల ఏర్పాటుతో సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నెహ్రూపైనా విమర్శలు గుప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌లను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి గరిబీ హఠావో నినాదంతో పని చేసిన ప్రధానమంత్రి ఇందిరా గాంధీపైనా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గరి నుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే 2014 నుంచి 2026 వరకు 12 ఏళ్లలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.151 లక్షల కోట్లు అప్పులు చేశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. గోరంత పనులను కొండంతగా చెప్పుకుంటున్నారని, ఎన్నో యుద్ధాలు, ఆకలి, నిరక్షరాస్యతలను అధిగమించిన విజయాలను ఎందుకు ప్రచారం చేయరని ప్రశ్నించారు. తెలంగాణ బిడ్డ పి.వి. నరసింహారావు కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారని, తర్వాత కాలంలో అదే నవోదయ విద్యాలయాలకు, గురుకుల పాఠశాలకు నమూనాగా నిలిచిందని సీఎం చెప్పారు. సాగు నీటి ప్రాజెక్టులను నెహ్రూ ఆధునిక దేవాలయాలుగా వర్ణించారని, నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణలో ఈనాడు 2.85 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం(వరి) ఉత్పత్తి సాధ్యమైందని అన్నారు. ప్రతీ పేద విద్యార్థికి విద్యను అందించడంతో సరిపెట్టుకోకుండా వారిని ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దాలనేది తన ఆశయమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కొండారెడ్డిపల్లి వంటి మారుమూల పల్లె ప్రభుత్వ పాఠశాలలో చదివిన తాను రాష్ట్రంలోని 12 వేల పల్లెల్లోని పాఠశాల పిల్లలు ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నానన్నారు.

సమాజ మార్పునకే విద్యా శాఖ బాధ్యతలు

విద్యా శాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని కొందరు విమర్శిస్తున్నారంటూ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా? టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా? ఐటీఐలను ఏటీసీలుగా మార్చినందుకా? స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్‌గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో వాళ్లు తెలపాలని రేవంత్ డిమాండ్ చేశారు. ఓట్లు, రాజకీయం కోసం తాను పని చేయడం లేదన్నారు. సమాజ మార్పునకే తాను విద్యా శాఖ బాధ్యతలు తీసుకున్నానని తెలిపారు. సమావేశానికి ముందు ఫిన్‌లాండ్, జర్మనీల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం వీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ డైరెక్టర్ శాంతికుమారి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులను ‘క్రిమినల్ వేస్ట్’ అంటావా?

సిద్దిపేట, జూలై 30:

ప్రపంచ దేశాల్లో ప్రతిభ చాటుతూ రాష్ట్రానికి, దేశానికి పేరు తెస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థులను ‘క్రిమినల్ వేస్ట్’ అంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించడం అత్యంత దురదృష్టకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులకు కనీసం దరఖాస్తు రాయడం కూడా రాదని వ్యాఖ్యానించడం ద్వారా ఉపాధ్యాయ లోకాన్నే అవమానించారని, ముఖ్యమంత్రి వెం టనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ఇంజినీ రింగ్ విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో సీపీఎస్ ఉద్యోగులు నిర్వహించిన “జన చైతన్య యాత్ర”లో పాల్గొని వారికి సంఘీభావం ప్రక టించిన హరీశ్‌రావు మాట్లాడుతూ, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధా నం (ఓపీఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఆరు నెలల్లో పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఈహెచ్ఎస్, ఓపీఎస్ అమలు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శిం చారు. ప్రభుత్వం ఏర్పడి 32 నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఉద్యోగులు అన్ని వేదికలపై విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం స్పందించకపోవడంతోనే రోడ్డెక్కాల్సిన పరి స్థితి వచ్చిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం రాత్రింబవళ్లు పనిచేసే ఉద్యోగులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు ఏవీ నిలవలేదని, ఉద్యోగుల ఆవేదనకు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ నిధులను కూడా ఎనిమిది నెలల పాటు ప్రభుత్వం జమ చేయలేదని, బీఆర్ఎస్ అసెం బ్లీలో నిలదీయడంతోనే వాటిని చెల్లించడం ప్రా రంభించిందని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదని, మెగా డీఎస్సీ హామీ కూడా అమ లు కాలేదని.. విద్యాశాఖలో ఇన్ని సమస్యలు ఉండగా వాటిని పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి వి ద్యార్థులను, ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులు, విజిలెన్స్, ఏసీబీ, సీఐడీ విచారణలతో అణిచివేసే ప్రయత్నం చే స్తోందని ఆరోపించిన హరీశ్‌రావు, ఉద్యోగులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యోగుల సమ స్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని, అవసరమైతే సభను స్తంభింపజేసైనా వారి హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ అమలు సహా ఉద్యోగుల అన్ని న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బీఆర్ఎస్ పూర్తి అండదండలు అందిస్తుందని హామీ ఇచ్చారు.

100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు

- మే 29, జూన్ 30, జూలై 30న మూడు విడతల్లో నిధుల విడుదల
- విశ్రాంత ఉద్యోగుల కమ్యూటేషన్ బకాయిలు పూర్తిగా క్లియర్
- మిగిలిన బకాయిలను కూడా దశలవారీగా చెల్లిస్తామని ప్రభుత్వం హామీ
- ఉద్యోగ జేఏసీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు

హైదరాబాద్, జూలై 30:

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీని అమలు చేస్తూ 100 రోజుల్లో మొత్తం రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపును పూర్తి చేసింది. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు మూడు విడతల్లో ఈ నిధులను విడుదల చేసిన ప్రభుత్వం, తాజాగా మూడో విడతగా మరో రూ.2,000 కోట్ల విడుదలకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన కమ్యూటేషన్ బకాయిలన్నీ పూర్తిగా చెల్లించబడ్డాయి.

మూడు విడతల్లో నిధుల విడుదల

ప్రభుత్వం గత మే 29న తొలి విడతగా రూ.2,000 కోట్లు, జూన్ 30న రెండో విడతగా మరో రూ.2,000 కోట్లు విడుదల చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తాజాగా మూడో విడతగా మరో రూ.2,000 కోట్లను విడుదల చేశారు. దీంతో మొత్తం రూ.6,000 కోట్ల బకాయిల చెల్లింపు ప్రక్రియ పూర్తయింది.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పదవీ విరమణ పొందిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆర్థిక శాఖ పేర్కొంది. కమ్యూటేషన్ బకాయిలు పూర్తిగా చెల్లించడంతో పాటు, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేసింది.

ఉద్యోగుల్లో హర్షం

బకాయిల చెల్లింపు పూర్తికావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఉద్యోగ జేఏసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రాజ్యసభకు ప్రశ్నాపత్రాల లీకేజీ నిరోధక బిల్లు

మొదటిపేజీ తరువాయి

ఏడు గంటల పాటు చర్చించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఏమాత్రం సహించే ప్రసక్తే లేదన్నారు. పిల్లల భవిష్యత్తును ప్రమాదంలో పడేయడాన్ని అనుమతించ బోమన్నారు. దేశంలోని విద్యార్థులు, యువత సంక్షేమాన్ని పరిరక్షించడంలో ప్రభుత్వ నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనమని చెప్పారు. ఈ బిల్లును తీసుకురావడానికి ప్రధాని ఏ మాత్రం ఆలస్యం చేయలేదని కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసి ప్రధాని మోదీ కుర్చీ కాపాడారని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై మాట్లాడుతూ.. ‘నీట్ పేపర్ లీక్ వల్ల చాలా మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. పేపర్ లీక్ కాకుండా ప్రభుత్వం ఏమాత్రం ముందస్తు చర్యలు చేపట్టలేదు. 2024లోనే ఈ బిల్లును ఎందుకు తీసుకురాలేదు? దిల్లీలో విద్యార్థుల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై అమిత్‌షా ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ ఘటనకు ఆయన బాధ్యత వహించాల్సిందేనని అన్నారు. నీట్ ప్రశ్న పత్రం లీక్, విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం ఆందోళనకు దిగిన వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారని మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులపై బాష్పవాయువు కూడా ప్రయోగించారని తెలిపారు. పోలీసుల తీరుపై కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. ఇంతటి దారుణ ఘటనకు అమిత్ షాదే బాధ్యత అని స్పష్టం చేశారు. దీనిపై ఇంతవరకు అమిత్ షా ఎలాంటి ప్రకటన చేయలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఘటనపై నోరు విప్పి మాట్లాడాలంటూ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ఖర్గే డిమాండ్ చేశారు. పేపర్ లీక్ వల్ల విద్యార్థులు నష్టపోవాలా? అని కేంద్రాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. నీట్ పేపర్ లీక్ కారణంగా.. చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలని ఈ సందర్భంగా కేంద్రానికి ఖర్గే స్పష్టం చేశారు. విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీచేయాలి? అని మోదీ సర్కారును ఆయన నిలదీశారు. పేపర్ లీక్ అనేది తలదించుకోవాల్సిన అంశమని ఖర్గే అభివర్ణించారు. 2024లోనే ఈ బిల్లు ఎందుకు తీసుకురాలేదని కేంద్రాన్ని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలుపు తప్ప విద్యార్థులపై ప్రేమ లేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. బిహార్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులపై తుపాకులు ఎక్కుబెట్టారని విమర్శించారు. ఆందోళన చేసిన యువత ఉగ్రవాదులు కాదు కదా? అని కేంద్రానికి ఖర్గే చురకలంటించారు.

వందేమాతరం గీతానికి పార్లమెంట్ ఆమోదం

మొదటిపేజీ తరువాయి

బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ గేయాన్ని అవమానించడం నేరంగా పరిగణించేలా నేషనల్ ఆనర్ యాక్ట్ 1971 చట్టంలో మార్పుల కోసం కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాజ్యాంగం, జాతీయ జెండా, జాతీయ గీతాన్ని అవమానించిన వారికి ప్రస్తుతం గరిష్ఠంగా మూడేళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఇకపై జాతీయ గేయాన్ని అవమానించిన వారికి కూడా ఇదే శిక్ష పడేలా చట్టంలో మార్పులు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపిన ఈ గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్‌ఖైన నేపథ్యంలో కేంద్రం ఈ గేయానికి మరిన్ని రక్షణలు కల్పిస్తూ తాజా బిల్లును తీసుకొచ్చింది. బంకిమ్ చంద్ర ఛటర్జీ 1875లో ఈ గేయాన్ని రచించారు. ఆనంద్‌మఠ్ నవలలో భాగంగా తొలిసారి 1882లో ఈ గేయం ప్రచురితమైంది. ఇక ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గేయం ఆలపనకు సంబంధించి కేంద్రం ఇటీవల రాష్ట్రాలకు నూతన మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాజ్యసభలో ఈ బిల్లును జులై 24న ప్రవేశపెట్టగా జులై 29న ఆమోదం లభించింది. నేడు లోక్‌సభ కూడా బిల్లుకు ఆమోదం తెలిపింది. నీట్ పేపర్ లీక్ వ్యతిరేకంగా ప్రతిపక్షాల నిరసనల నడుమ రెండు సభల్లోనూ బిల్లుకు ఆమోదం లభించింది.

సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి

సిరిసిల్ల, జూలై 30:

సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. సూపర్ ఎల్ నినోపై కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించగా మంత్రులు తుమ్మల, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు. జిల్లా ఎల్ నినో ప్రణాళిక, తెలంగాణ జలసిరి పేరిట రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా పరిధిలో ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయి.. వాటిలో నీటిమట్టం.. ఎన్ని ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు.. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా.. విద్యుత్ సరఫరా తదితర అంశాలపై మంత్రి తుమ్మల ఆరా తీశారు. సూపర్ ఎల్ నినో ప్రభావం దక్షిణ భారత దేశంపై ఎక్కువగా ఉంటుందని, వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని అన్నారు. ఇప్పుడు రిజర్వాయర్లలో ఉన్న నీరు తాగునీటికి మాత్రమే వచ్చే ఏడాది జూలై వరకు వినియోగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. రెండు రోజుల్లో కురిసిన వర్షం పంటలకు కొంత మేలు చేస్తుందని, కానీ పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ఉపయోగపడదని తెలిపారు. రెండు నెలలు వర్షాలు సరిగా కురవక పంటల సాగు గణనీయంగా తగ్గిందని, వచ్చే నెలలో ఏ పంటలు సాగు చేస్తే మేలో రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆరుతడి, స్వల్పకాలిక పంటలు, పప్పు ధాన్యాలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా వివరించాలన్నారు. వాటికి కావలసిన అన్ని విత్తనాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. మంచి ప్రణాళిక ప్రకారం వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ముందుకు వెళ్లాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి రైతులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలి

గత ఏడాదితో పోలిస్తే భూ గర్భ జలాలు రెండు మీటర్లకుపైగా లోతులోకి వెళ్ళాయని వెల్లడించారు. జిల్లాలోని అన్ని రిజర్వాయర్లలోని నీరు పంటలకు విడుదల చేసే అవకాశం లేదని, భూ గర్భ జలాల సమాచారం అధికారులు ప్రజలు, రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్స్ రీచార్జ్ పనులు, పామ్ పాండ్స్ నిర్మాణ పనులు ముమ్మరంగా చేయించాలని స్పష్టం చేశారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. జిల్లాలోని మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని, రిజర్వాయర్ల నీటిని పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పంపింగ్ కోసం కావాల్సిన మోటర్లు అదనంగా సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎరువుల కొరత, ఇతర ఇబ్బందులపై వచ్చే అసత్య ప్రచారాలు చేయకుండా చూడాలని సూచించారు. పోలీస్ అధికారులు శాంతిభద్రతలు పరిరక్షిస్తూనే ప్రతీ అంశంపై దృష్టి సారించాలని ఆదేశించారు. సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

రైతులకు అవగాహన కార్యక్రమాలు

ఎల్ నినో, పంటల మార్పిడిపై జిల్లాలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు, ఇన్‌చార్జి మంత్రి సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. జిల్లాలో తాగునీటి సరఫరాకు శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) జలాశయం కీలకమని తెలిపారు. గత ఏడాది జిల్లాలో లక్షా 85 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 78 వేల ఎకరాల్లో సాగు అయిందని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతు భరోసా అందుతున్న రైతుల ఫోన్లకు సమాచారం పంపుతున్నామని వెల్లడించారు. ఆగస్టులో సాగు చేసే పంటలపై ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులకు మరిన్ని సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు ఆయిల్ పామ్ 1500 ఎకరాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 400 ఎకరాలు పూర్తి చేయించామని, మిగతా పురోగతిలో ఉందని వెల్లడించారు. జలసిరి కింద జిల్లాలో నీటి సంరక్షణ పనులు పకడ్బందీగా చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్, జూలై 30 :

తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతు పవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ(డిజాస్టర్ మేనేజ్‌మెంట్) అధికారులతో ఆయన గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, రాబోయే రెండు రోజుల్లో కురిసే వర్షాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల వద్ద ముందస్తు భద్రతా చర్యలు తీసుకోవాలని, ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా(హైడ్రా, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30% మేర ఉన్న వర్షపాతం లోటు రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భర్తీ అయి దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం గురు, శుక్రవారాల్లో (జూలై 30, 31) రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వివిధ జిల్లాలకు అలర్టులు జారీ అయ్యాయని మంత్రి తెలిపారు. ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశామని, అలాగే నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామని తెలిపారు. ఆయా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

భారీ వర్షా లు కురిసే అవకాశం

తీవ్ర వాయుగుండం నేపథ్యంలో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు జగిత్యాల జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఈ రెండు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉమ్మడి నిజామాబాద్‌తో పాటు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. దీంతో ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్‌తోపాటు హనుమకొండ, జనగాం, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందంటూ ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌లోని వాతావరణ కేంద్రం ప్రకటించింది.

ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షా లు

హైదరాబాద్, జూలై 30:

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలాగే రానున్న మరో మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తెలంగాణ వ్యాప్తంగా కొన్ని రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు నదులు, ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్రల్లోని ఎగువ ప్రాంతాల్లో వర్షాపాతం తీవ్రమవడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలోని పలు కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలాశయాలు సంతరించుకుంటున్న జలకళ రైతుల్లోనూ, ప్రజల్లోనూ తీవ్ర ఆనందాన్ని నింపుతోంది. నిజామాబాద్ జిల్లాలోని ప్రతిష్టాత్మక శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 12,900 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, ప్రాజెక్టు నీటి నిల్వ 17.103 టీఎంసీలకు చేరింది. కాకతీయ కాలువ ద్వారా దిగువకు 300 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది. అలాగే, నిర్మల్ జిల్లాలోని సారంగాపూర్ మండలంలో ఉన్న స్వర్ణ ప్రాజెక్టుకు ఉదయం వేళకు నీటి సామర్థ్యం అర టీఎంసీ దాటి, ఇన్ ఫ్లో దాదాపు 10 వేల క్యూసెక్కులకు చేరింది. నిర్మల్ జిల్లాకే తలమానికమైన కడెం ప్రాజెక్టుకు వరద నీరు విపరీతంగా పోటెత్తుతోంది. ఉదయం 11:00 గంటల సమయానికి కడెం ప్రాజెక్టుకు ఏకంగా 77,442 క్యూసెక్కుల భారీ ఇన్ ఫ్లో నమోదు కాగా, పరిస్థితికి అనుగుణంగా అధికారులు 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఇక జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద ప్రాణహిత, గోదావరి ఉభయ నదులు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అక్కడ నీటిమట్టం 6.320 టర్ల ఎత్తులో మెట్ల వద్దకు చేరడంతో తీరం కొత్త రూపు సంతరించుకుంది. గోదావరి జలాలు పోటెత్తడంతో కాళేశ్వరం ప్రాజెక్ట్ లోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్ కి ఇన్ ఫ్లో భారీగా పెరిగింది. ఎన్డీఎస్ఏ సూచనలను పాటిస్తూ అధికారులు బ్యారేజ్ కి చెందిన మొత్తం 85 గేట్లను ఎత్తి ఉంచారు. ప్రస్తుతం అక్కడ ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో సమంగా 1,01,530 క్యూసెక్కులుగా కొనసాగుతుండటంతో గోదావరి ప్రవాహం దిగువకు వేగంగా పయనిస్తోంది. ప్రాజెక్టుల్లో క్రమంగా నీటి నిల్వలు పెరుగుతుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పరిస్థితిని నిరంతరం సక్షిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురియ నుండటంతో 9 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు భారీ వర్షాల నేపథ్యంలో 6 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. భారీ వర్షాలకు ఉత్తర తెలంగాణతో పాటు నిజామాబాద్ జిల్లాలోని చెరువులు, కుంటలు అలుగుపోస్తున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలను దృష్టిలో పెట్టుకొని జగిత్యాల జిల్లాలో పాఠశాలలకు సెలవను ప్రకటించారు. ఈ సీజన్‌లో తొలిసారిగా జూరాల ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదలారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితోపాటు, పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటిమట్టం పెరుగుతోంది. గురువారం ఉదయానికి 27 అడుగులకు చేరింది. నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు వరద పోటెత్తున్నది. దీంతో అప్రమత్తమైన ప్రాజెక్టు అధికారులు ప్రాజెక్టు 6 వరద గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్ ఫ్లోగా ప్రాజెక్టులోకి 77,442 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టు 6 వరద గేట్లు 10 ఫీట్లు గేట్లు ఎత్తి అవుట్ ఫ్లోగా 67, 000 క్యూసెక్కుల నీటిని దిగవనున్న గోదావరిలోకి అధికారులు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు 3.495 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి మట్టం 693.725 అడుగులు 2.212 టీఎంసీలలో ప్రాజెక్టు నీటి సామర్థ్యం కొనసాగుతుంది. కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా వెళ్లకూడదని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. కడెం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని అధికారులు కోరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి పారుతున్నాయి. ఆదిలాబాద్ సహా ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఉట్నూరు, నార్నూరు, జైనూరు మండలాల్లో రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి నర్సాపూర్, శాంతాపూర్ వాగులు పొంగాయి. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో ఉన్న మేడిగడ్డ బ్యారేజ్‌కి వరద ప్రవాహం పోటెత్తుతుంది. గురువారం బ్యారేజ్ వద్ద 81,060 క్యూసెక్కుల వరద ప్రవాహం రాగా బ్యారేజ్‌లోని 85 గేట్లు ఎత్తి అంతే మొత్తంలో వరదనీటిని భారీ నీటిపారుదల శాఖ అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా బ్యారేజీకి వరద ప్రవాహం మరింత పెరుగుతుందని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు. ములుగు జిల్లా వాజేడు మండలం లో కురుస్తున్న భారీ వర్షానికి చీకుపల్లి అటవీప్రాంతంలో ఉన్న తెలంగాణ నయాగర బొగత జలపాతం ఉప్పొంగింది. జలపాతం ముందు ఉన్న సెల్ఫీ వ్యూ పాయింట్‌పై నుంచి స్విమ్మింగ్ పూల్ దుగా ఉధృతంగా ప్రవహించింది. దీంతో బొగత సందర్శనకు అటవీశాఖ అధికారులు మధ్యాహ్నం నుంచి అనుమతి నిలిపివేశారు. తాము టికెట్ తీసుకొని లోపలకు వెళ్లగా అనుమతి లేదని బయటకు పంపించారని, టికెట్ డబ్బులు ఇవ్వాలని అడిగినా అధికారుల నుంచి సమాధానం కరువైందని కొందరు పర్యాటకులు ఆరోపించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి రేంజ్ అధికారి నరేందర్‌ను అడగగా అలాంటిదే లేదని, జలపాతం వీక్షించిన తర్వాతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బయటకు పంపించామని తెలిపారు. ఉదయం 6 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా నమోదయిన వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. వాజేడులో అత్యధికంగా వాజేడులో 16.5 సెం.. ఏటూరునాగారం, 15.2, సర్వాయిపేటలో 14.3, జైపూర్‌లో 14 సెం., బెజ్జూరులో 14, సెం.., కన్నాయిగూడెంలో 13 సెం.., వెంకటాపురం, 12.6, ముత్తారం, మహదేవ్‌పూర్ లో 12.2 సెం.., నస్పూర్ 11.8 సెం.. ఆసిఫాబాద్‌లో 11.3 సెం.., సింగరేణి(రెబ్బన)లో 11.2 సెం.., కాగజ్‌నగర్, మేడారంలో 10.6 సెం.., సిర్పూర్(టి)లో 10.5 సెం.., కౌతాలంలో 104, కాటారంలో 10.3, నెన్నెలలో 10.3 సెం.. వర్షపాతం నమోదయింది.

వర్షా లపై మంత్రి కోమటి రెడ్డి ఆరా

రాష్ట్రంలోలో రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సక్షా సమావేశం నిర్వహించారు. వర్షాల వల్ల ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్ అండ్ బీ డివిజన్ల వారీగా రోడ్లు, బ్రిడ్జిలు, లో కాజ్‌వేలు, కల్వర్టుల వివరాలపై ఆరా తీశారు. ముంపు ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్వర్టులలో కాజ్‌వేలు, కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టాలన్నారు. అధికారులు అందరూ ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న రోడ్లు, బ్రిడ్జిల వద్ద తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్ట్ తయారు చేయాలని, క్షేత్రస్థాయి ఇంజినీర్లతో మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని వెల్లడించారు. ఈఎన్సీ నుంచి ఏఈ వరకూ అందరు పూర్తి అలెర్ట్‌గా ఉండాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

పదవిలో ఉన్నా సామాన్యుడిలా కోర్టుకు హాజరు

మొదటిపేజీ తరువాయి

వేధింపుల కారణంగా నాగ రామకృష్ణ కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ కుమార్తె సాహితిని కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌లో పరామర్శించేందుకు భట్టి విక్రమార్క వెళ్లారు. అయితే కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారంటూ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై నమోదు చేసిన కేసులో భట్టి విక్రమార్క నాంపల్లిలోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు (ఎక్సైజ్ కేసెస్) విచారణ నిమిత్తం గురువారం హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఒక సాధారణ పౌరుడిలా ఆయన కోర్టుకు హాజరు కావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పాత పాల్వంచకు చెందిన మీసేవ కేంద్ర నిర్వాహకుడు నాగ రామకృష్ణ(45) తల్లి, సోదరితో ఉన్న ఆస్తి వివాదాన్ని పరిష్కరించే నెపంతో నా భార్య శ్రీలక్ష్మి(40)ని తన వద్దకు పంపాలని రాఘవ కోరినట్లు రామకృష్ణ ఆత్మ హత్యకు ముందు విడుదల చేసిన సూసైడ్ సెల్ఫీ వీడియోలో కన్నీటిపర్యంతమయ్యారు. మానప్రాణాలకు భంగం వాటిల్లడంతో వేరే మార్గం లేక రామకృష్ణ 2022 జనవరి 3 అర్ధరాత్రి దాటిన తర్వాత భార్య శ్రీలక్ష్మి, కవల కుమార్తెలు సాహిత్య(13), సాహితి(13) లపై పెట్రోల్ పోసి గ్యాస్ లీక్ చేసి నిప్పు అంటించారు. ఈ ఘటనలో రామకృష్ణ, శ్రీలక్ష్మి, సాహిత్య అక్కడికక్కడే మృతిచెందారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ సాహితి కూడా చనిపోయింది. అంతకుముందు ఆమెను పరామర్శించేందుకు నాటి సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కాంగ్రెస్ నేత ఎడవెల్లి కృష్ణలతో కలిసి 2022 జనవరి 4న కొత్తగూడెం ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్లగా ఆ సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారంటూ బందోబస్తు విధుల్లో ఉన్న బ్లూకోల్ట్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు భట్టి విక్రమార్క సహా పలువురు కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు చేశారు.

నంది పంప్‌హౌజ్ ద్వారా ఎత్తిపోతలు

మొదటిపేజీ తరువాయి

ద్వారా 3,150 క్యూసెక్కుల చొప్పున మొత్తం 4 మోటార్ల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని పంపింగ్ చేసి నంది రిజర్వాయర్ లోకి ఎత్తిపోస్తున్నారు. అనంతరం అదే పరిమాణంలో నంది రిజర్వాయర్ క్రస్ గేట్ల ద్వారా జలాలు ఏడో ప్యాకేజీ జంట సొరంగాల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ లోకి వెళుతుంది. ఆ పంప్ హౌస్ లోని నాలుగు బహుబలి మోటార్లను ఆన్ చేసి అక్కడ నుంచి వరద కాలువ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని శ్రీ రాజరాజేశ్వర జలాశయానికి నీటిని తరలిస్తున్నారు.

అంగన్‌వాడీల్లో మౌలిక వసతులకు పెద్దపీట

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్, 3,815 కేంద్రాలకు తాగునీటి, 14,271 కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై మంత్రి సీతక్క సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఏమాత్రం జాప్యం చేయకుండా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ వంటి పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సంబంధిత ఏఈలు, డీఈలతో సమన్వయం చేసుకుని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ఏ కేంద్రంలో ఏ పని పూర్తయింది, ఇంకా ఎంత పని మిగిలి ఉందన్న వివరాలతో నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వారి ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సర్వే ఫలితాల ఆధారంగా పోషకాహార కార్యక్రమాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. చిన్నారులకు పాలు, బ్రేక్‌ఫాస్ట్ అందించే కార్యక్రమాలను అన్ని జిల్లాల్లో వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు జిల్లాలవారీగా టీచర్లు, ఆయాలతో ప్రత్యేక సదస్సులు నిర్వహించి క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అవసరాలు, సేవల మెరుగుదలకు సంబంధించిన సూచనలు స్వీకరించి వాటి ఆధారంగా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 16 జిల్లాల్లో నియామకాలకు నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా మిగిలిన జిల్లాల్లో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లకు డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిప్లొమా సర్టిఫికెట్లు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కేంద్రాలు పిల్లల అభ్యాసం, ఆటపాటలు, ఆరోగ్యం, పోషణకు అనువైన వాతావరణంగా మారాలని చెప్పారు. వర్షాల కారణంగా ఎక్కడైనా కేంద్రాన్ని మార్చాల్సి వస్తే చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. బస్టాండ్లు వంటి రద్దీ ప్రాంతాల్లో తల్లులు తమ పిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించగా అన్ని జిల్లాలు, ప్రాంతాల్లో ఇలాంటి కేంద్రా

సంపాదకీయం

ప్రతిపక్ష పాత్రలో కాంగ్రెస్ వైఫల్యం!

నిర్మాణాత్మక రాజకీయాలకు దూరం.. అవకాశవాద వైఖరిపై విమర్శలు

ఈ దేశ దౌర్భాగ్యం ఏమంటే అసమర్థ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉండడం. అధికారంలో ఉంటే అవినీతికి పాల్పడడం, కుంభకోణాలను చేయడం, పాలనను గాలికి వదిలి వేయడం చూశాం. పదేళ్ల యూపిఎ పాలనలో మన్మోహన్ సింగ్‌ను ముందుకు పెట్టి ఎన్ని అరాచకాలు చేశారో చెప్పలేం. అలాగే ప్రతిపక్షంలో గత పదేళ్లుగా నిర్మాణాత్మక పాత్ర పోషించడంలోనూ విఫలం అవుతూ వస్తోంది. నిజానికి ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షానిదే బలమైన పాత్ర అని చెప్పాలి. దీనిని గుర్తించి నడచుకోవడంలో కూడా కాంగ్రెస్ పూర్తిగా విఫలం అయ్యింది. అధికార ఎన్‌డిఎ తప్పుడు పనులు చేస్తుంటే నిలదీయడం లేదు. ఆశ్రిత పక్షపాతం చూపితే నిలదీయడం లేదు. ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేయడం లేదు. ఎందుకంటే ఆశ్రితపక్షపాతం, బంధుప్రీతి, కుటుంబ పాలన కాంగ్రెస్‌లో నరనరాన జీర్ణించుకుపోయింది. ఇంట్లో ఉన్న ముగ్గురు వ్యక్తులు పార్లమెంట్‌లోనే ఉన్నారు. కుటుంబ పాలనకు ఇదే నిదర్శనం. ఇకపోతే పార్లమెంట్ సమావేశాల్లో కూడా బలంగా ప్రజల వాణిని విన్పించడం లేదు. కాక్రోచ్ పార్టీకి వస్తున్న ఆదరణను తమ ఖాతాలో వేసుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. వారి ఉద్యమాన్ని హైజాక్ చేసి లబ్ధి పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ క్రమంలో వారుచేస్తున్న ఆందోళనలు ఎబ్బెట్టుగా ఉన్నాయి. తాజాగా పార్లమెంట్ లోపలా బయటా విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశించారో చెప్పాలన్న డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ బయట ప్లకార్డులు పట్టుకుని ఆందోళనకు దిగారు. అందరూ గతంలో పాలన చేసిన వారే. కాంగ్రెస్, సమాజ్‌వాదీ, తృణమూల్ అంతా పాలకులుగా ఉండివచ్చిన వారే. లాఠీ ఛార్జ్ చేయమని హోంమంత్రి ఆదేశిస్తారా అన్నది కూడా తెలియని వారు మన పాలనా వ్యవస్తలో ఉండడం దౌర్భాగ్యం. పోలీస్ మాన్యువల్ కూడా తెలియకుండా రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతున్నారు. లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పితే పోలీసులే నిర్ణయం తీసుకుని లాఠీఛార్జ్ చేస్తారు. నిషేధిత పార్లమెంట్ పరిసరాల్లో, ప్రధాని నివాసం వద్ద ఎలాంటి ఆందోళనలు జరిగినా తప్పకుండా కంట్రోల్ చేస్తారు. ఇదికూడా తెలియ నట్లుగా ప్లకార్డులు పట్టుకుని లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని నినాదాలు చేయడం సిగ్గుచేటు. ఇది కేవలం రాజకీయంగా చేస్తున్న ఆందోళన తప్ప ఇందులో చిత్తశుద్ధి లేదని వారికి కూడా తెలుసు. అసలు కాంగ్రెస్ నిర్మాణాత్మకంగా వ్యవహరించి ఉంటే ఇవాళ విద్యార్థులు రోడ్డుకెక్కాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. జూన్ 6న సీజేపీ ఏర్పడడంపై వచ్చిన ప్రతిస్పందన చూసిన తర్వాతగానీ కాంగ్రెస్ గళం విప్పలేదు. మే మొదటి వారంలో పేపర్ లీక్ జరిగి, మే 12న పరీక్ష రద్దయిన తర్వాత కాంగ్రెస్ తీవ్రంగా ప్రతిస్పందించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేసేందుకు చేయాల్సినన్ని ప్రయత్నాలు చేయలేదు. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటాలో 'ఛాత్రోంకి గుంజ్' పేరిట విద్యార్థుల ర్యాలీని నిర్వహించిన రాహుల్‌గాంధీ ఆ తర్వాత 23 రోజుల పాటు అదృశ్యమై జర్మనీలో కాలక్షేపం చేశారు. సీజేపీ వ్యవస్థాపకుడు ఢిల్లీలో ప్రవేశించి తమ ఆందోళన తీవ్రతరం చేసిన తర్వాత, పార్లమెంటు సమావేశాలు మరో మూడు రోజుల్లో జరుగుతా యనగా రాహుల్‌లో కలవరం కలిగింది. అందుకే అమాంతంగా లేచి ప్రధాని నివాసం ముందు ధర్నాకు దిగారు. రాజకీయాల్లో నిరంతరత్వం, నిత్య క్రియాశీలత్వం లేకపోతే పరిస్థితి మరొకరి చేతుల్లోకి వెళుతుందన్న విషయం రుజువైంది. మునుపటిలాగా నాటకీయంగా ధర్నాలు చేయడం, అరెస్టు కావడం వల్ల ప్రజల సానుభూతి లభించదని కాంగ్రెస్ గ్రహించాలి. 2014 నుంచీ పార్లమెంట్‌ను కాంగ్రెస్ స్తంభింపజేయడం, నిరసన ప్రదర్శనలు నిర్వహించడం వంటివి చేస్తూనే ఉన్నది. అందంతా కేవలం నాకీయ రాజకీయ ప్రయోజనం కోరి చేస్తున్నవే. కేవలం నెలరోజుల నిరసనతో కాక్రోచ్ పార్టీ ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేయగలిగింది. అటువంటి నైతిక స్థైర్యం కాంగ్రెస్, ప్రతిపక్షాలకు ఎందుకు లేకుండా పోయిందన్నదే ప్రశ్న. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడానికే కాదు, పరీక్షల్లో అక్రమాలను నిరోధించేం దుకు ప్రభుత్వం ఆగమేఘాలపై బిల్లు తేవడానికి, ప్రధానమంత్రి రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ బిల్లు గురించి ప్రకటించడానికి సిజెపి ఉద్యమమే కారణం. నెల రోజులకు పైగా శాంతియ-ుతంగా నిరసన ప్రదర్శన చేస్తూ పరీక్షా పత్రాల లీక్‌కు విద్యామంత్రి నైతిక బాధ్యత వహించాలని కోరిన యువతీ యువకులతో దేశవ్యాప్తంగా ఎంతోమంది కనెక్టయ్యారు. నిజానికి ప్రతి ఉద్యమంలోనూ ఎంతో కొంత హింసాకాండ, విధ్వంసం జరుగుతూనే ఉన్నది. చాలాసార్లు పోలీసుల దమనకాండ అణచితేకు పోలీసులు లాఠీఛార్జ్ షరామామూలే. అంతమాత్రాన మొత్తం ఉద్యమానికి విశ్వసనీయత లేకుండాపోదు. అయితే ప్రతిపక్షంగా కాంగ్రెస్ విఫలం అవుతూనే ఉంది. ఇప్పుడు రాహుల్ వారిని భుజాన వేసుకుని ఊరేగే ప్రయత్నం చేస్తున్నారు. దీనిని ప్రజలు గమనిస్తున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని అవమానంగా భావించనక్కర్లేదు. జరిగిన పరిణామాల్ని ఆత్మావలోకనం చేసుకుని తగిన చర్యలు తీసుకునేందుకు లభించిన అవకాశంగా భావించాలి. కాంగ్రెస్ ఇప్పటికైనా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలి. లేకుంటే కాంగ్రెస్ ప్రతిపక్ష స్థానం కూడా కోల్పోతుంది.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా మోదీ మారాలి

ప్రధాని పదవికి మోడీ రాజీనామా చేస్తేనే మంచిది

- రాష్ట్రాల్లో విద్యార్థులను వేధిస్తే మళ్లీ ఆందోళన తప్పదు
- కాక్రోచ్ చీఫ్ అభిజిత్ దీప్కే హెచ్చరిక

పుణె, జూలై 30: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశాన్ని పాలించడం కంటే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా బాగా పనిచేస్తారని, అందువల్ల ప్రధాని పదవికి రాజీనామా చేసి ఆ బాధ్యతను మరొకరికి అప్పగించాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం తొలిసారి మహారాష్ట్రలోని తన స్వస్థలానికి చేరుకున్న అభిజీత్ దీప్కే మీడియాతో మాట్లాడుతూ, ఢిల్లీలో ఆందోళనలు ముగిసిన తర్వాత వివిధ రాష్ట్రాల్లో విద్యార్థి నిరసనకారులను గుర్తించి వేధిస్తున్నారని ఆరోపించారు. వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని, లేకపోతే రానున్న ఎన్నికల్లో యువత తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విద్యార్థుల ఆగ్రహం తగ్గలేదని, వారి అసంతృప్తి ఒక్క మంత్రిపైనే కాకుండా కేంద్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. యువత భావోద్వేగాలను బీజేపీ ఇప్పటికీ అర్థం చేసుకోలేకపోతోందని విమర్శించారు. విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. "విద్యార్థులు ఉగ్రవాదులు కాదు.. దేశ భవిష్యత్తు. వారి స్వరాన్ని అణచివేస్తే అవసరమైతే ప్రభుత్వాన్నే మార్చే స్థాయిలో ఉద్యమం చేపడతాం" అని హెచ్చరించారు. ఢిల్లీ జంతర్‌మంతర్‌లో జరిగిన నిరసన సందర్భంగా విద్యార్థులపై పెల్లెట్ గన్ వినియోగించారన్న ఆరోపణలపై స్పందించిన ఆయన, ఇందుకు బాధ్యులెవ్వరైనా వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం సీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకోవడంపై వచ్చిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు. 36 రోజులపాటు ఎండవానలను లెక్కచేయకుండా పోరాడిన కార్యకర్తలు విజయాన్ని జరుపుకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత బీజేపీ కూడా సంబరాలు చేసుకుంటుందని గుర్తు చేశారు. రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌ను పార్లమెంట్‌లో సన్మానించడం సిగ్గుచేటని అభిజీత్ విమర్శించారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న నేపథ్యంలో అలాంటి సన్మానం ద్వారా బీజేపీ ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటోందని ప్రశ్నించారు. పేపర్ లీక్ కేసుల విషయంలో కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని ఆరోపించిన ఆయన, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల గురించి ప్రధాని ప్రకటించినప్పటికీ తొలి విచారణకే సీబీఐ తరపు న్యాయవాది హాజరుకాకపోవడం ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేస్తోందన్నారు. బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఆమె పార్ట్‌టైమ్ రాజకీయ నాయకురాలని, తాను సీరియస్ రాజకీయ నాయకులు చేసే వ్యాఖ్యలకే స్పందిస్తానని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.

సోషల్ మీడియాలో ప్రధాని రాజీనామా లేఖ

ఫేక్ లేఖగా గుర్తించిన కేంద్ర సంస్థ పీఐబీ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన



న్యూఢిల్లీ, జూలై 30: ప్రధాని నరేంద్ర మోదీ రాజీనామా చేసినట్లు ఆయన సంతకంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ పూర్తిగా ఫేక్ అని కేంద్ర ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం నిర్ధారించింది. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అలాంటి లేఖ ఏదీ విడుదల కాలేదని, మోదీ కూడా దానిపై సంతకం చేయలేదని స్పష్టం చేసింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఈ ఫేక్ లెటర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అధికారిక వర్గాల నుంచి నిర్ధారణ చేసుకోకుండా ఇలాంటి సందేశాలను నమ్మకూడదని, ఫార్వర్డ్ చేయకూడదని 'ఎక్స్' వేదికగా పీఐబీ సూచించింది. 'ప్రధాని సంతకంతో ప్రచారంలో ఉన్న లేఖ పూర్తిగా ఫేక్. తప్పుడు పత్రాలు, నకిలీ మెసేజ్ల ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం, తప్పుగా ప్రచారం చేయడం, కొన్ని సందర్భాల్లో ఆర్థిక మోసాలకు పాల్పడటం జరుగుతుంది' అని తెలిపింది. వైరల్ పోస్టులను ఆధారంగా చేసుకుని వ్యక్తిగత, ఆర్థిక వివరాలను షేర్ చేసుకోవద్దని, పెట్టుబడుల వంటి నిర్ణయాలు తీసుకోవద్దని పౌరులకు సూచించింది పీఐబీ. అనుమానాస్పద పోస్టులు, నకిలీ పత్రాలు కనిపిస్తే పీఐబీ ఫ్యాక్ట్ చెక్ బృందానికి వాట్సాప్ లేదా ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరింది. కృత్రిమ మేధ ఆధారిత నకిలీ కంటెంట్, ఫోర్జరీ పత్రాలు పెరుగుతున్న నేపథ్యంలో ఏ సమాచారాన్నైనా అధికారిక వర్గాలు ధ్రువీకరించాకే నమ్మాలని అధికారులు సూచిస్తున్నారు.

విధి నిర్వహణలో భయానికి తావు లేదు

నిజాయితీగా విద్యుక్త ధర్మం నిర్వహించండి

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర

న్యూఢిల్లీ, జూలై 30: సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధుల్లో ధైర్యసాహసాలు ప్రదర్శించిన సిబ్బందికి సన్మానం చేసిన కార్యక్రమంలో ఆయన ఉత్తేజపూరిత ప్రసంగం చేశారు. ఎలాంటి భయం లేకుండా పనిచేయాలని బలగాలకు పిలుపునిచ్చారు. సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్‌గా ఇక్కడ నేను మీకో హామీ ఇస్తున్నాను. విధులు నిజాయతీగా నిర్వర్తించడంలో మీరు తీసుకునే నిర్ణయాలు, చర్యలకు నేను బాధ్యత వహిస్తాను. ప్రజాప్రయోజనం కోసం తీసుకునే చర్యలకు జవాబుదారీగా వ్యవహరించాల్సి వస్తే.. దానిని నేను పూర్తిగా స్వీకరిస్తానని జ్ఞానేంద్ర తన సిబ్బందిని ఉద్దేశించి పేర్కొన్నారు. ఈ నెల 20న 'చలో పార్లమెంటు' నిరసనల సమయంలో భద్రతా విధులు నిర్వర్తించిన సీఆర్పీఎఫ్-ఆర్ఏఎఫ్ బలగాలు, పోలీసులు.. విద్యార్థులపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతోన్న వేళ.. జ్ఞానేంద్ర ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఆరోపణలపై సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ అంతకుముందు కూడా స్పందించారు. ఏదైనా భారీ ఆపరేషన్ తర్వాత తాము వృత్తిపరమైన మూల్యాంకనం చేపడతామని చెప్పారు. నిరసనకారులపై ఆర్ఏఎఫ్ సిబ్బంది తీసుకున్న చర్యల విషయంలోనూ ఆ పరిశీలన చేస్తామని తెలిపారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు దేశవ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర పోలీసులతో సహకరిస్తూ.. వైవిధ్య పరిస్థితులకు తగ్గట్టుగా వేగంగా స్పందించగల సామర్థ్యం వారి సొంతం. ఇక, ఏదైనా ప్రాంతంలో ఘర్షణలు, రద్దీ, అశాంతియుత పరిస్థితులను నెలకొన్నప్పుడు వాటిని నియంత్రించేందుకు సీఆర్‌పీఎఫ్‌లోని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ను రంగంలోకి దింపుతారు.

చైనా నుంచి ఇరాన్‌కు ఆయుధాలు

చైనా తీరుపై ట్రంప్ అసహనం

వాషింగ్టన్, జూలై 30: అమెరికా విమానాలు, హెలికాప్టర్లకు తలనొప్పిగా మారిన కొన్ని ఆయుధాలను చైనా నుంచి ఇరాన్ కు సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. వీటి రవాణాకు పాకిస్థాన్‌ను మార్గంగా ఎంచుకొన్నట్లు అంతర్జాతీయ వార్తా సంస్థ సంచలన కథనం ప్రచురించింది. దీంతో అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. పాక్ పేరు ఎత్తకుండా చైనాపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చైనా ఆయుధాల సరఫరా విషయం తెలుసుకొని తాను నిరాశకు గురైనట్లు పేర్కొన్నారు. తాము ఇరాన్‌కు ఆయుధాలు విక్రయించ బోమని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ స్వయంగా తనకు హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. చైనా, రష్యాల నుంచి ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేయవద్దని గత వారం ట్రంప్ హెచ్చరికలు కూడా జారీ చేశారు. చైనా నుంచి దాదాపు 60 మిలియన్ డాలర్లకు పైగా విలువైన 400 షోల్డర్ట్÷ర్డ్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కొనుగోలుకు ఒప్పందం జరిగింది. వీటితో తమ గగనతల రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరాన్ భావిస్తోంది. అయితే.. ఈ డీల్‌కు టెహ్రాన్ పక్షాన హాంకాంగ్ చెందిన ఝూంగ్‌కింగ్ బావోషాంగ్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ మధ్యవర్తిగా ఉంది. ఈ క్షిపణులను ఉత్తర చైనా నుంచి పాకిస్థాన్ మీదుగా ఇరాన్‌లోకి చేర్చాలని ప్రణాళిక సిద్ధం చేశారు. కాకపోతే వీటిని భూమార్గంలో తరలిస్తారా..? గగనతలంలో తీసుకెళతారా అనే అంశంపై స్పష్టత లేదు. అయితే ఈ కథనాలను చైనా కొట్టిపారేయడం గమనార్హం. ఈ క్రమంలోనే తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ అంశంపై స్పందించారు.

మందుగుండు సామాగ్రి వివరాలు భద్రపరచండి

సుప్రీంలో పెల్లెట్ గన్స్ వినియోగంపై విచారణ

న్యూఢిల్లీ, జూలై 30: జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో ఢిల్లీ పోలీసులు పెల్లెట్ గన్స్ వినియోగంపై వివాదం నడుస్తోంది. దీనిపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జనసమూహాన్ని నియంత్రించే సమయంలో పోలీసుల బలప్రయోగం ఎలా ఉండాలనే అంశంపై అమలులో ఉన్న గ్రేడెడ్ యూజ్ ఆఫ్ ఫోర్స్ స్టాండింగ్ ఆర్డర్‌ను కోర్టు ముందు సమర్పించాలని ఆదేశించింది. వాడటానికి స్పష్టమైన రూల్స్ ఉండాలని జస్టిస్ బాఘ్చి వ్యాఖ్యానించారు. అదే సమయంలో పెల్లెట్ గన్స్‌నూ పూర్తిగా నిషేధించలేమని చెప్పింది. మరోవైపు పిటిషనర్ల తరుపున న్యాయవాది వాదిస్తూ.. ప్రస్తుతం అమలులో ఉన్న మార్గదర్శకాల్లో నిరసనల సమయంలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగానికి అనుమతి లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ అలాంటి ఆయుధాలు వాడకంపై పోలీసుల చర్యలపై విచారణ కోరారు. ఈ వాదనల్ని పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, క్రౌడ్ కంట్రోల్‌లో బలప్రయోగానికి సంబంధించిన అధికారికి స్టాండింగ్ ఆర్డర్‌ను రికార్డ్‌లో ఉంచాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. అత్యవసర పరిస్థితుల్లో పెల్లెట్ గన్స్ వాడే అధికారం పోలీసులకు ఉందని చెప్పింది. ఇదే సమయంలో పోలీసులు వాడిన మందుగుండు సామాగ్రికి సంబంధించిన వివరాలు భద్రపరచాలని ఆదేశించింది. పెల్లెట్ గన్స్ కాల్పుల్లో గాయపడిన వారికి పూర్తి న్యాయ సహాయం అందించాలని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌ను ఆదేశించింది. ఈ కేసు విచారణలో ఢిల్లీ పోలీసులు సమర్పించే స్టాండింగ్ ఆర్డర్, పెల్లెట్ గన్ వినియోగంపై కోర్టు చేపట్టే పరిశీలన కీలకంగా మారే అవకాశం ఉంది.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యే విధంగా జాగ్రత్తలు

- ఆగస్టు మూడవ తేదీలోపు ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి
- 100% డిజిటలైజేషన్ అయ్యేవిధంగా అధికారులు పనిచేయాలి

వికారాబాద్, రాజముద్ర న్యూస్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటర్ గా నమోదయ్యే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. గురువారం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 10,17,671 ఓటర్లకు గాను ఇప్పటివరకు 7,96,005 డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 83 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందని ఇందులో భాగంగా 1,13,092 ఏ.ఎస్.డి ఓటర్లుగా గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 3వ తేదీలోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయాలని భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 100 శాతం డిజిటలైజేషన్ చేసే విధంగా అధికారులు పనిచేస్తున్నారని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీల్లో, మున్సిపల్ వార్డులలో ఏ.ఎస్.డి (అబ్సెంట్, షిఫ్ట్, డెత్, డూప్లికేట్) జాబితాలను ప్రదర్శించడం జరిగిందని దీనిపై రాజకీయ పార్టీ ప్రతినిధులు, బూతు స్థాయి ఏజెంట్లు ప్రత్యేక దృష్టి సారించి మార్పులు, చేర్పులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. జాబితాలో ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. 1200 ఓటర్లు ఉంటే అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓట్లు ఉండే విధంగా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటు అనేది చాలా ముఖ్యమని రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎస్ఐఆర్ లో అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి, డిఆర్ఓ స్వర్ణలత, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నెమత్ అలీ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో

వికారాబాద్, రాజముద్ర న్యూస్ : రాబోయే 48 గంటల పాటు జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో తెలిపినారు. జిల్లాలో అందరూ పోలీసు అధికారులు, సిబ్బంది 24×7 అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశం. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అత్యవసర పరిస్థితులకు వెంటనే స్పందించేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. రెవెన్యూ, అగ్నిమాపక, వైద్య, పంచాయతీరాజ్ తదితర శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగించాలని ఆదేశించారు. అంబులెన్సులు, వైద్యులు, సహాయక బృందాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు ఉద్ధృతంగా ప్రవహిస్తే ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వవద్దని తెలిపారు. పాత ఇండ్లలో నివసించే కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలాలని, శిథిల భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండటం, గుంతలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఇతర శాఖల అధికారులతో కలిసి వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. ప్రమాదకర వాగులు, కల్వర్టులు, వరద ముంపు ప్రాంతాల వద్ద రోడ్డు బ్లాక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, ట్రాఫిక్ మళ్లించడం, సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఎస్పీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్–100 లేదా వికారాబాద్ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ – 8712670056 కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో ప్రజలకు తెలియజేయడం జరిగింది.

కన్న తండ్రే కామాంధుడు

- మైనర్ కూతురిపై పలుమార్లు అత్యాచారం
- వివరాలు తెలిపిన వికారాబాద్ సిఐ రఘుకుమార్

వికారాబాద్,, రాజముద్ర న్యూస్: కన్న తండ్రే కామాంధుడిగా మారి తన మైనర్ కూతురిపై పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హాస్టల్‌లో ఉంటున్న బాలిక కడుపునొప్పితో బాధపడుతూ టీచర్లకు విషయం చెప్పడంతో ఈ దారుణం బయటపడింది. టీచర్ సమాచారం మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించగా, ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూ సి)కి తెలియజేయగా, బాలికను భరోసా కేంద్రానికి తరలించారు. బాలికను విచారించగా కీలక విషయాలు వచ్చాయని, నిందితుడు మొబైల్ ఫోన్లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు జగన్నాథ్ (42) నారాయణఖేడ్‌కు చెందినవాడు. సుమారు 20 సంవత్సరాల క్రితం వికారాబాద్‌కు వచ్చి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా, రెండో భార్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో భార్య మరణించడంతో హాస్టల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన సమయంలో మూడో కుమార్తెను మాయమాటలు చెప్పి పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 27న బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు పోక్సో చట్టం కింద(క్రైమ్ నెంబర్ 245 /2026 కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుడు గురువారం ఇంటి వద్ద పరిస్థితులు తెలుసుకునేందుకు వచ్చిన సమయంలో అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వికారాబాద్ సీఐ రఘుకుమార్ తెలిపారు.

ఎయిర్పోర్ట్ భూసేకరణ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఎయిర్పోర్ట్, ఇండస్ట్రియల్ పార్క్ భూసేకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా, ఎలాంటి చట్టపరమైన చిక్కులు తలెత్తకుండా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రీహ్యాబిలిటేషన్ అండ్ రిసెటిల్మెంట్ కమిషనరేట్ ఆధ్వర్యంలో భూసేకరణ విభాగ ప్రత్యేక అధికారి మనోహర్తో కలిసి నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిర్పోర్ట్ ప్రాజెక్టు జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిందని, డిసెంబర్ 31 నాటికి సంబంధిత ఏజెన్సీలకు భూమిని అప్పగించేలా రెవెన్యూ అధికారులు కార్యాచరణను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. గడువు పరిమితంగా ఉన్నందున పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అధికారుల బృందాల సంఖ్యను పెంచనున్నట్లు తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో ప్రతి దశలో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి న్యాయపరమైన లోపాలు తలెత్తకుండా రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో తలెత్తే సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవడంతో పాటు వ్యవసాయేతర భూములు, నిర్మాణాల లెక్కింపు, రికార్డుల వ్యత్యాసాలపై సమగ్ర సర్వే నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో భారీ వర్షాల సూచన నేపథ్యంలో తహశీల్దార్లు, క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది తమ ప్రధాన కేంద్రాల్లోనే అందుబాటులో ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ భూసేకరణ విభాగ ప్రత్యేక అధికారి మనోహర్ పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూసేకరణ ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలు, అమలు విధానాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, ఏఓ వర్ణ, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షా ల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రాంతాలకు వెళ్లొద్దు
- జిల్లా ఎస్పీ నితికా పంత్

రాజముద్ర న్యూస్, కాగజ్నగర్: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. గురువారం కాగజ్నగర్, దహెగాం, పెంచికల్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పొంగిపొర్లుతున్న వాగులు, లో-లెవెల్ వంతెనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్లు, రోపులు వంటి రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచడంతో పాటు ప్రజలకు నిరంతరం హెచ్చరికలు జారీ చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, లో-లెవెల్ వంతెనలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని జలపాతాలకు ప్రస్తుతం అనుమతి లేదని, పర్యాటకులు, యువత వాటర్ఫాల్స్కు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా చేపల వేట కోసం వాగులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లవద్దని, పశువులను మేతకు తీసుకెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించవద్దని, అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోరారు. అలాగే వరద ప్రాంతాల్లో సెల్ఫీలు, రీల్స్ కోసం వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా ప్రజలు పోలీసు, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ శాఖల సూచనలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ పర్యటనలో కాగజ్నగర్ డీఎస్పీ వాహిదుద్దీన్, రూరల్ సీఐ కుమారస్వామి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, ఎస్సైలు రమేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో విషాదం

2 రోజులైనా ఆచూకీ లేని బాలయ్య

శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్ :మియాపూర్ వైశాలి నగర్ నారాయణ్ ఎస్టేట్స్‌లో మంగళవారం రాత్రి బాలయ్య అనే వ్యక్తి ఓపెన్ నాలో పడి గల్లంతయ్యాడు. ఘటన జరిగి రెండు రోజులు గడిచినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రక్షణ సేన నాయకులు విష్ణువర్ధన్ చారీ, షేక్ అస్లాం, మురుగేషన్, సలాం తదితరులు గాలింపులో పాల్గొన్నారు. ఓపెన్ నాలాలకు రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గల్లంతైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి వున్నాము

సిఎం ని కలిసి నిధులు కేటాయించ వలసిందిగా కోరతాము

సూర్యాపేట, రాజముద్ర న్యూస్: సూర్యాపేట పట్టణ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుస్తామని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది అన్నారు. ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తో కలిసి సిఎం రేవంత్ రెడ్డిని కలిసి సూర్యాపేట అభివృద్ధి కోసం వంద కోట్ల రూపాయలు కేటాయించవలసిందిగా కోరుతామని వారు అన్నారు. పట్టణ సమగ్ర అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. స్థానిక 26 వార్డులో ఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి డ్రైన్ కు గురువారం శంకుస్థాపన చేశారుమ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వార్డులో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్ పాలగాని మాధవి కృష్ణ,పిల్లల రమేష్ నాయుడు, డి ఇ ప్రణయ్ రెడ్డి,నాయకులు వల్దాసు దేవేందర్, తండు శ్రీనివాస్, దండ అరవింద రెడ్డి,యాట ఉపేందర్,కోడి కృష్ణ,వరుణ్, వార్డు జవాను శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు

సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

రాజముద్ర న్యూస్, తాండూర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తాండూర్ తహశీల్దార్ యు.జ్యోత్స్న, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్ తెలిపారు. గురువారం గోపాల్ నగర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన సమగ్ర భూ సర్వే అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. సమగ్ర భూ సర్వే కార్యక్ర మం ద్వారా రైతులకు దీర్ఘకాలిక ప్రయో జనాలు కలుగుతాయని తెలిపారు. భూముల కొలతలను ఖచ్చితంగా నమోదు చేయడంతో భవిష్యత్తులో భూ రికార్డుల నిర్వహణ సులభతరం అవుతుందని అన్నారు. భూ సమస్యల పరిష్కారానికి ఈ సర్వే ఎంత గానో ఉపయోగపడుతుందని పేర్కొ న్నారు. రైతులు తమ భూములకు సంబం ధించిన వివరాలను సరిచూసుకుని, సర్వే ప్రక్రియలో భాగ స్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాల్ నగర్ గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య, ఆర్ఐ బొలిశెట్టి పద్మజ, సర్వేయర్ రామకృష్ణ, కార్యదర్శి సౌందర్య, రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షా లకు దెబ్బతిన్న రేచిని రోడ్–రైల్వే స్టేషన్ మార్గం

హైవే మార్గాన్నే వినియోగించాలని విజ్ఞప్తి



రాజముద్ర న్యూస్, తాండూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు తాండూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేచిని రోడ్–రైల్వే స్టేషన్ రహదారి తీవ్రంగా దెబ్బతింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ గురువారం దెబ్బతిన్న రహదారి, తాండూర్–రైల్వే స్టేషన్ మధ్య ఉన్న వంతెనను పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. మేకలవాణి చెరువు నిండడంతో మత్తడి నీరు అధికంగా ప్రవహించి రైల్వే స్టేషన్ సమీపంలోని రహదారి పూర్తిగా కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల భద్రత దృష్ట్యా తాండూర్ మండల ప్రజలు రైల్వే స్టేషన్ వెనుక వైపు ఉన్న దెబ్బతిన్న మార్గాన్ని ఉపయోగించవద్దని, ప్రత్యామ్నాయంగా హైవే రోడ్డు ద్వారానే ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు పరిస్థితిని పూర్తిగా సాధారణ స్థితికి తీసుకువచ్చే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండి సహకరించాలని కోరారు. వారి వెంట బెల్లంపల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంతెన శివకృష్ణ, నాయకులు కంపేల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదలపై సీఎంకు కృతజ్ఞతలు

రాజముద్ర న్యూస్, బోథ్: పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంపై కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోత రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పోలీస్ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది యువతకు ఈ నోటిఫికేషన్ కొత్త ఆశలు, ఆత్మవిశ్వాసాన్ని కల్పించిందని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. తెలంగాణ యువత ప్రభుత్వానికి అండగా ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలీస్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

వాగును పరిశీలించిన ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ

రాజముద్ర న్యూస్, జైనూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని జంగం గ్రామ సమీపంలోని వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ గురువారం వాగు వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా వాగు నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ఆయన గ్రామస్తులతో మాట్లాడారు. వరద నీరు పూర్తిగా తగ్గే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ముఖ్యంగా రైతులు, విద్యార్థులు, వాహనదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులను వాగులు, కాలువల సమీపానికి వెళ్లనివ్వవద్దని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులతో సమన్వయం కొనసాగిస్తూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

వీఎం బంజర్లో కోతుల బీభత్సం

• చిన్నారిని కాపాడబోయిన తండ్రిపై దాడి.. గ్రామస్తుల్లో భయాందోళన

రాజముద్ర న్యూస్, సత్తుపల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ గ్రామంలో కోతుల గుంపు బీభత్సం సృష్టించింది. గ్రామానికి చెందిన మాధవ్ తన 11 నెలల చిన్నారితో ఇంటి వద్ద ఉండగా ఒక్కసారిగా కోతులు దాడి చేశాయి. చిన్నారిని రక్షించే ప్రయత్నంలో మాధవ్పై కోతులు తీవ్రంగా దాడి చేయడంతో ఆయనకు గాయాలయ్యాయి. గాయపడిన మాధవ్ను కుటుంబ సభ్యులు వెంటనే పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. చిన్నారి స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడినట్లు తెలిసింది. గ్రామంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి కోతుల సంచారాన్ని నియంత్రించి గ్రామస్తులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డ్రైనేజీలు పొంగి రోడ్లపై చేరిన మురుగు నీరు

రాజముద్ర న్యూస్, వాంకిడి: మండలంలోని సరండి గ్రామపంచాయతీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో డ్రైనేజీలు పొంగిపొర్లి రోడ్లపై మురుగు నీరు చేరింది. కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి పేరుకుపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక గ్రామంలోని పలు వీధులు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోకి కూడా నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల స్పందన కోసం ఎదురుచూడకుండా గ్రామ యువకులు, పెద్దలు, స్థానికులు స్వచ్ఛందంగా రంగంలోకి దిగారు. పారలు, ఇనుపరాడ్లు, కర్రలతో డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ కవర్లు, మట్టిని తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించారు. గ్రామంలోని అన్ని డ్రైనేజీలను యంత్రాలతో శుభ్రం చేయాలని, రోడ్లపై నిలిచిన నీటిని వెంటనే తొలగించాలని, శాశ్వత వరద నివారణ చర్యలు చేపట్టి కొత్త డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యం, ఆస్తుల రక్షణ కోసం తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారాలే అవసరమని స్పష్టం చేశారు.

వర్షా ల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

• జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్

రాజముద్ర న్యూస్, ఆసిఫాబాద్ రూరల్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వాగులు, వంకలు, చెరువులు, కాజ్వేలు, లోతట్టు ప్రాంతాలలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లాలోని రాజుర వద్ద ఉన్న వాగు కాజ్వేను సందర్శించి, నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించి వరద నీటి ఉధృతి, రాకపోకల పరిస్థితి, ప్రజలు, వాహనదారులు ఎదు ర్కొంటున్న ఇబ్బందులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కాజ్వే వద్ద వరద నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు కాజ్వేను దాటకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని, నీటి మట్టం, ప్రవాహ ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితిని బట్టి ప్రజలకు రాకపోకలపై సూచనలు తెలిపారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమ యంలో కాజ్వే మీదుగా రాకపోకలను నియంత్రించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు వాగులు, వంకలు, కాజ్వేలు, కల్వర్టులు, ఇతర నీటి ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని, వరద నీటిలో వాహనాలతో వెళ్లేందుకు ప్రయత్నించడం, నీటి ప్రవాహాన్ని అంచనా వేయకుండా కాజ్ వేలను దాటడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాల సమయంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచే పరిస్థితులు, రహదారులపై వరద నీటి ప్రవాహం, చెరువులు, కుంటలు, వాగుల వద్ద నీటి మట్టం పెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అత్యవసర పరిస్థితులలో ప్రజలకు తక్షణ సహాయం అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా జిల్లా యంత్రాంగం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని, వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

• పలు కాలనీల్లో మున్సిపల్ చైర్పర్సన్ పర్యటన

రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్: భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్తో కలిసి పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. బంగారిగూడ, డైట్ గ్రౌండ్, మణిపూర్ కాలనీ, దస్నాపూర్, రాంనగర్ తదితర ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్పా ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీటిలో ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలకు వెంటనే సహాయం అందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో సెల్:9000018842పై సంప్రదించాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరం విధులు నిర్వహిస్తుండగా, జేసీబీలు, అత్యవసర స్పందన బృందాలు సిద్ధంగా ఉన్నాయని, అవసరమైతే ఎన్డీఆర్ఎఫ్ సేవలను కూడా వినియోగిస్తామని వివరించారు. ఖాళీ స్థలాల యజమానులు తమ ప్లాట్లలో మట్టి, మొరం వేసి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు సహకరించాలని కోరారు. అలాగే నాలాలు, వాగులపై నిర్మించిన అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని హెచ్చరించారు. ఆమె వెంట శానిటరీ ఎస్సైలు శంకర్, నరేందర్, నారాయణ రెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రవి కిరణ్, కౌన్సిలర్లు మంగేష్, దత్తు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎస్ఐఆర్ కీలకం

బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్

రాజముద్ర న్యూస్, బోథ్: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ శ్రేణులు, బీఎల్ఏ–2 పూర్తి సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బిన్ హమ్దాన్, ఆదిలాబాద్ జిల్లా అబ్జర్వర్ అరెపల్లి మోహన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సోయం బాపురావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ జాదవ్తో కలిసి ఓటర్ల జాబితా సవరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి బూత్లో ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా బీఎల్ఏ–2లు, కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, భూపెల్లి శ్రీధర్, నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ పసుల చంటి, మాజీ బ్లాక్ అధ్యక్షుడు ప్రపుల్ చందర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆశన్న, జిల్లా కార్యదర్శులు లోలపు పోశెట్టి, భీంరావు పాటిల్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు దౌలత్ రావు, సొనాల మండల అధ్యక్షుడు గాజుల పోతన్న, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చైర్మన్ అంజయ్య, మాజీ అధికార ప్రతినిధి ఎండి సద్దాం, మాజీ ఎంపీటీసీ ఉమేష్, సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు సాంగ్వీలో కూలిన గోడ

రాజముద్ర న్యూస్, కెరమెరి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని సాంగ్వి గ్రామంలో ఓ ఇంటి గోడ కూలిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పింది. సాంగ్వి–కేలి బీ గ్రామాల మధ్య ఉన్న ఒర్రె ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద ఉధృతి కారణంగా మహారాష్ట్ర సరిహద్దు గ్రామాలతో పాటు ఇందాపూర్, ఖైరి, గోండుగూడ తదితర సుమారు 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుధవారం రాత్రి ఇంటి గోడ కూలిపోయిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహమ్మద్ సుజాయిత్ ఖాన్, స్థానిక సర్పంచ్ కార్వేత విమల–బాపూరావుతో కలిసి ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఓ కాలనీలో వరద నీరు ఇండ్ల మధ్య చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీడీఓ అంజత్ పాషా, తహశీల్దార్ నాగార్జున, ఎస్సై శ్రీకాంత్తో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇళ్లలోకి నీరు చేరకుండా ఆయిల్ ఇంజిన్ ద్వారా వెంటనే నీటిని తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం అధికారులు సాంగ్వి–కేలి బీ గ్రామాల మధ్య ఉప్పొంగి ప్రవహిస్తున్న ఒర్రెను పరిశీలించి, వరద ప్రవాహం తీవ్రంగా ఉన్నందున ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అండగా ఉంటాం

• వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి గడ్డం వివేకానంద

రాజముద్ర న్యూస్, మంచిర్యాల: ప్రస్తుతం కొనసాగుతున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని, అత్యవసర పరిస్థితుల్లో అధికార యంత్రాంగం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఏసీపీ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగుతో కలిసి మందమర్రి మున్సిపల్ పరిధిలోని 19, 7 వార్డుల్లో వర్ష ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్లే మార్గంలో నీటి ప్రవాహాన్ని పరిశీలించడంతో పాటు కూలిన ఇంటి గోడను సందర్శించి బాధితులకు పరిహారం అందించి ఇంటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెన్నూర్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత గ్రామాల్లో రవాణా సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి చర్యలు చేపట్టాలని సూచించారు. కోటపల్లి మండలం ఆల్గాం గ్రామంలో గోడ కూలిన ఘటనపై కూడా అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పురోగతిని సమీక్షించి, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రహానె రిటైర్మెంట్.. ఓటమి ఎరుగని
కెప్టెన్‌కు బీసీసీఐ సలాం

- అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన అజింక్యా రహానె
- భారత క్రికెట్‌కు చేసిన సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ బీసీసీఐ పోస్ట్
- టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా అరుదైన రికార్డు సాధించిన రహానె
- ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అందించిన ఘనత
- టెస్టులు, వన్డేలు, టీ20లలో మెరుగైన గణాంకాలతో కెరీర్‌కు ముగింపు

స్పోర్ట్స్ డెస్క్ :

భారత సీనియర్ బ్యాటర్, టెస్టుల్లో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన అజింక్య రహానె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు నేడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ వీడియో ద్వారా ప్రకటించాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన కెరీర్‌కు తెరపడింది. రహానె రిటైర్మెంట్ ప్రకటనపై బీసీసీఐ వెంటనే స్పందించి, ఆయన సేవలను కొనియాడింది.

"ఒక అద్భుతమైన కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌కు మీరు అందించిన అపారమైన సేవలకు, చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలకు ధన్యవాదాలు. మీ తదుపరి ప్రయాణానికి మా శుభాకాంక్షలు" అని బీసీసీఐ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేసింది.

కెప్టెన్‌గా చెరగని ముద్ర

బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా రహానె తనదైన ముద్ర వేశాడు. టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా ఆయనకు అరుదైన రికార్డు ఉంది. కనీసం ఐదు మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన భారత కెప్టెన్లలో అత్యధిక విజయశాతం రహానెదే కావడం విశేషం. అతని సారథ్యంలో భారత్ నాలుగు టెస్టుల్లో గెలిచి, రెండింటిని డ్రా చేసుకుంది.

ఆస్ట్రేలియా గడ్డపై 202021లో జరిగిన బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును చారిత్రక విజేతగా నిలపడం అతని కెప్టెన్సీ కెరీర్‌లో మరుపురాని ఘట్టం. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించిన రహానె, మెల్‌బోర్న్‌లో అద్భుత విజయాన్ని అందించాడు. ముఖ్యంగా గబ్బాలో ఆస్ట్రేలియాకు ఏళ్ల తరబడి ఉన్న ఓటమి ఎరుగని రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను 21 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో పాటు 2017లో ధర్మశాలలో ఆస్ట్రేలియాపై, 2018లో ఆఫ్ఘనిస్తాన్‌పై కూడా జట్టును విజయపథంలో నడిపించాడు.

మూడు ఫార్మాట్లలో గణాంకాలు

తన కెరీర్‌లో రహానే 85 టెస్టులు ఆడి 12 సెంచరీలు, 26 అర్ధ సెంచరీలతో కలిపి 5,077 పరుగులు చేశాడు. 90 వన్డేలలో 3 సెంచరీలు, 24 అర్ధ సెంచరీలతో 2,962 పరుగులు సాధించాడు. ఇక, 20 టీ20 మ్యాచ్‌లలో ఒక అర్ధ సెంచరీతో 375 పరుగులు చేశాడు. ఆటగాడిగా, నాయకుడిగా భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన రహానె రిటైర్మెంట్‌తో ఒక శకం ముగిసినట్లయింది.



భారత్ వస్తుందని ఆశిస్తున్నా.. బంగ్లా అత్యంత సురక్షితం

స్పోర్ట్స్ డెస్క్ :

బంగ్లాదేశ్‌లో టీమ్‌ఇండియా పర్యటనపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. షెడ్యూల్ ప్రకారం గతేడాది ఆగస్టులో మూడు వన్డేలు, మూడు టీ20లను ఆడేందుకు భారత్ వెళ్లాలి. కానీ, ఆ దేశంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో నాడు సిరీస్ జరగలేదు. ఆ పర్యటనను ఈ ఏడాది సెప్టెంబర్‌కు వాయిదా వేస్తూ అప్పుడు నిర్ణయం తీసుకున్నారు. అయితే, బంగ్లాదేశ్‌లో భద్రతపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉద్దేశంతో బీసీసీఐ పునరాలోచనలో పడింది. ఈ క్రమంలో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తప్పకుండా తమ దేశానికి వస్తుందనే నమ్మకం ఉందన్నారు. ''భారత్‌తో సిరీస్ గురించి ఇప్పుడే చెప్పలేను. కానీ, తప్పకుండా ఆ జట్టు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే బీసీసీఐతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఈమెయిల్స్ రూపంలోనూ చర్చలు జరుగుతున్నాయి. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాం. భారత్ బంగ్లాదేశ్ మధ్య సిరీస్ మరింత ఆసక్తికరంగా ఉంటుందని భావిస్తున్నా. బంగ్లా అత్యంత సురక్షితమైన దేశం. ఇక్కడ వారికి ఎలాంటి భద్రతాపరమైన ఇబ్బందులు ఉండవు. మా వైపు నుంచి అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నాం'' అని తమీమ్ స్పష్టం చేశారు.

నాకూ పరిమితులు ఉంటాయి

భారత క్రికెట్ క్యాలెండర్‌లో సెప్టెంబర్ విండో ఖాళీగా లేదు. అఫ్గాన్‌తో మూడు టీ20ల సిరీస్‌లో టీమ్‌ఇండియా తలపడనుంది. ఇప్పుడు బంగ్లా పర్యటనను ఖరారు చేస్తే అఫ్గాన్‌తో సిరీస్‌ను వాయిదా వేయాల్సి ఉంటుంది. దీనిపైనా తమీమ్ స్పందిస్తూ ''బీసీబీ అధ్యక్షుడిగా నాకూ కొన్ని పరిమితులు ఉంటాయి. వాటిని నేను క్రాస్ చేయలేను. నా బాధ్యత పరిధిలో సాధ్యమైనంత వరకూ సంబంధిత వ్యక్తులతో మాట్లాడుతూనే ఉన్నా. బంగ్లాతో సిరీస్ ఆడితే ప్రయోజనం ఏంటనేది వారికి వివరించే ప్రయత్నం చేస్తున్నా'' అని తమీమ్ వ్యాఖ్యానించారు.

ఇంగ్లండ్ టెస్టు సారథిగా మళ్లీ జో రూట్.. హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్

- రెండోసారి ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్‌గా జో రూట్ నియామకం
- న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కొత్త హెడ్ కోచ్
- బెన్ స్టోక్స్ రిటైర్మెంట్, మెకల్లమ్ తొలగింపు తర్వాత ఈ మార్పులు
- పాకిస్థాన్‌తో సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక కోచ్
- పరిమిత ఓవర్ల కోచ్‌గా బ్రెండన్ మెకల్లమ్ కొనసాగింపు

స్పోర్ట్స్ డెస్క్ :

ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. స్టార్ బ్యాటర్ జో రూట్ రెండోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అదే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎంపిక చేసింది. ఈ మేరకు నేడు అధికారిక ప్రకటన విడుదల చేసింది.

ఇటీవల మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం, టెస్టు హెడ్ కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెకల్లమ్‌ను తొలగించడంతో ఈ కీలక నియామకాలు జరిగాయి. గతంలో 2017 నుంచి 2022 వరకు రూట్ 64 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. టెస్టు క్రికెట్‌లో 14,000 పరుగులకు పైగా సాధించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు.

ఈ సందర్భంగా రూట్ మాట్లాడుతూ.. "మళ్లీ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది కష్టమైన బాధ్యత అయినా, ఎంతో సంతృప్తినిస్తుంది. తర్వాతి తరం ఆటగాళ్లను ముందుకు నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నాను" అని తెలిపాడు. ఫ్లెమింగ్‌ను ఆటపై అపారమైన పరిజ్ఞానం ఉన్న అద్భుతమైన నాయకుడిగా అభివర్ణించాడు.

మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ సమర్థించాడు. ఫ్లెమింగ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన కోచ్‌లలో ఒకరని, జట్టులోని ప్రతిభను ప్రపంచ స్థాయి ప్రదర్శనగా మార్చగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు.

ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుత విజయాలతో పాటు జట్టుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తును అందించడమే లక్ష్యం. కెప్టెన్ జో రూట్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. అతను తరానికి ఒక్కడొచ్చే ప్రతిభావంతుడు" అని పేర్కొన్నాడు.

ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఆ తర్వాత ఫ్లెమింగ్ బాధ్యతలు స్వీకరిస్తాడు. బ్రెండన్ మెకల్లమ్ ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల జట్లకు కోచ్‌గా కొనసాగుతాడు.

కామన్వెల్త్‌లో నీరజ్ దూకుడు.. రోహిత్, యశ్‌వీర్‌తో కలిసి ఫైనల్‌కు

- జావెలిన్ ఫైనల్‌కు చేరిన నీరజ్ చోప్రా
- రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్‌కూ అర్హత
- 79.61 మీటర్లతో ఐదో స్థానంలో నీరజ్
- గాలుల ప్రభావంతో ఎవరూ 84 మీటర్లు దాటలేదు
- అగ్రస్థానంలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్
- ఫైనల్లో నీరజ్-అర్షద్ పోరుపై ఆసక్తి

స్పోర్ట్స్ డెస్క్ :

గ్లాస్గో వేదికగా జరుగుతున్న 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు జావెలిన్ త్రో విభాగంలో శుభారంభం లభించింది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రాతో పాటు రోహిత్ యాదవ్, యశ్‌వీర్ సింగ్ ముగ్గురూ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్‌కు అర్హత సాధించారు. బలమైన గాలుల కారణంగా అథ్లెట్లకు త్రో విసరడం కష్టంగా మారినా, అత్యుత్తమ ప్రదర్శన చేసిన 12 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. శుక్రవారం జరిగే ఫైనల్లో ఈ ముగ్గురు భారత అథ్లెట్లు పతకాల కోసం పోటీ పడనున్నారు.

ఈ అర్హత పోటీలో ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ దూరమైన 84 మీటర్లను ఏ అథ్లెట్ అందుకోలేక పోయాడు. నీరజ్ చోప్రా తన రెండో ప్రయత్నంలో 79.61 మీటర్లు విసిరి ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరాడు. అప్పటికే అర్హత ఖరారవడంతో చివరి ప్రయత్నాన్ని ఉపయోగించుకోలేదు. రోహిత్ యాదవ్ 78.37 మీటర్లు విసిరి తొమ్మిదో స్థానంలో నిలిచాడు. యశ్‌వీర్ సింగ్ 78.36 మీటర్లతో పదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు.

గతేడాది సెప్టెంబర్ నుంచి నీరజ్ చోప్రాను నడుము కింది భాగం గాయం వేధిస్తోంది. ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ముందు ఈ గాయం కావడంతో అతను ఆశించిన స్థాయిలో రాణించలేక ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. గాయం కారణంగా ఈ ఏడాది సీజన్‌ను కూడా ఆలస్యంగా ప్రారంభించాడు. జూన్‌లో జరిగిన దోహా డైమండ్ లీగ్‌లో ఒక్కసారి మాత్రమే బరిలోకి దిగి 85.69 మీటర్లు విసిరి నాలుగో స్థానంలో నిలిచాడు.

అర్హత పోటీలో శ్రీలంక అథ్లెట్ రుమేశ్ పతిరాజే 82.84 మీటర్లు విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఈ సీజన్‌లో అతని పేరిట ప్రపంచంలోనే అత్యుత్తమ త్రో 92.62 మీటర్లు ఉంది. గ్రెనడాకు చెందిన రెండుసార్ల ప్రపంచ ఛాంపియన్ అండర్సన్ పీటర్స్ 81.29 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. దక్షిణాఫ్రికా అథ్లెట్ డౌ స్మిట్ 80.64 మీటర్లతో మూడో స్థానం దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌కు చెందిన బెన్ ఈస్ట్ నాలుగో స్థానంలో నిలవగా, ఆస్ట్రేలియా అథ్లెట్ కామెరాన్ మెక్‌ఎంటైర్ ఆరో స్థానంలో నిలిచాడు. ఒలింపిక్ ఛాంపియన్, పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ ఈ సీజన్‌లో తన అత్యుత్తమ ప్రదర్శనగా 78.63 మీటర్లు విసిరి ఏడో స్థానంతో ఫైనల్‌కు చేరాడు. దీంతో శుక్రవారం జరిగే ఫైనల్లో నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ మధ్య మరో ఆసక్తికర పోరు చూసే అవకాశం ఏర్పడింది.

జెర్సీ రంగు మార్పు వెనుక అసలు కారణమిదే.. వివాదానికి తెరదించిన హాకీ ఇండియా

- హాకీ జట్ల జెర్సీ రంగు మార్పుపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా క్లారిటీ
- నీలి రంగు టర్ఫ్‌పై బ్లూ జెర్సీ కలిసిపోతోందని, అందుకే ఈ మార్పు అని వెల్లడి
- మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా అభ్యంతరంతో సోషల్ మీడియాలో మొదలైన చర్చ
- జాతీయ జెండాలో భాగం కావడంతోనే కాషాయ రంగును ఎంచుకున్నామని వివరణ
- గతంలోనూ జెర్సీ రంగులు మార్చామని గుర్తు చేసిన హాకీ ఇండియా

స్పోర్ట్స్ డెస్క్ :

భారత జాతీయ హాకీ జట్ల జెర్సీ రంగును సాంప్రదాయ నీలి రంగు నుంచి కాషాయ రంగుకు మార్చడంపై చెలరేగిన వివాదంపై హాకీ ఇండియా స్పందించింది. ఇది కేవలం సాంకేతిక అవసరాల దృష్ట్యా ఆటగాళ్లు, సహాయక సిబ్బంది సూచనల మేరకే తీసుకున్న నిర్ణయమని స్పష్టం చేసింది. ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలను వివరిస్తూ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. వచ్చే నెల నెదర్లాండ్స్, బెల్జియంలో జరగనున్న 2026 హాకీ ప్రపంచకప్‌లో పురుషుల, మహిళల జట్లు కాషాయ రంగు జెర్సీలతో బరిలోకి దిగుతాయని ఈ నెల 27న హాకీ ఇండియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా భారత హాకీ మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా ఈ మార్పును ప్రశ్నించడంతో వివాదం మరింత పెద్దదైంది.

అసలు కారణం ఇదేనన్న హాకీ ఇండియా

ఈ వివాదంపై స్పందించిన హాకీ ఇండియా.. "అంతర్జాతీయ హాకీ పిచ్‌లు ఇప్పుడు ప్రామాణికంగా నీలి రంగు సింథటిక్ టర్ఫ్‌తో ఉంటున్నాయి. మన ఆటగాళ్లు ధరించే నీలి రంగు జెర్సీ ఈ టర్ఫ్‌లో కలిసిపోతోంది. దీనివల్ల మైదానంలో ఆటగాళ్లకు స్పష్టత లోపించి, ఆటపై ప్రభావం పడుతోంది. ఈ సాంకేతిక సమస్యను అధిగమించేందుకే జెర్సీ రంగు మార్చాలని నిర్ణయించాం" అని తన ప్రకటనలో పేర్కొంది. ఆటగాళ్లు, కోచ్‌లతో విస్తృతంగా చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేసింది.

రస్కిన్హా అభ్యంతరం.. రాజకీయ రంగు

మరోవైపు మాజీ కెప్టెన్ వీరేన్ రస్కిన్హా తన 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో.. "భారత హాకీకి నీలి రంగు అనేది గర్వకారణం, గుర్తింపు, వారసత్వం" అని అన్నారు. ఆయన పోస్ట్ వైరల్ కావడంతో చర్చ మొదలైంది. అయితే, తన పోస్టుకు అనవసరంగా రాజకీయ రంగు పులుముతున్నారని ఆయన ఆ తర్వాత ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలోనూ మార్చాం..

ఆటగాళ్లు, కోచ్‌లు పసుపు లేదా కాషాయం రంగును ప్రత్యామ్నాయంగా సూచించారని, మన జాతీయ జెండాలో కాషాయం రంగు ధైర్యానికి, త్యాగానికి, జాతీయ గౌరవానికి ప్రతీక కావడంతో దానిని ఖరారు చేశామని హాకీ ఇండియా తెలిపింది. జెర్సీ రంగును మార్చడం ఇదే మొదటి సారి కాదని కూడా గుర్తు చేసింది. "2014 ప్రపంచకప్‌లో జట్టు జెర్సీని పసుపు రంగులోకి, 2018 ప్రపంచకప్‌లో స్కై బ్లూ రంగులోకి మార్చాం. కార్యాచరణ అవసరాల మేరకు గతంలోనూ ఇలాంటి మార్పులు జరిగాయి" అని వివరించింది. సాంకేతిక అవసరాలు, జాతీయ భావన రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఈ మార్పు చేసినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది.

‘శ్రీనివాస మంగాపురం’తో ఆకట్టుకున్న
జయకృష్ణ–రాషా తడాని

లవ్, యాక్షన్, ఎమోషన్స్‌తో అలరించిన అజయ్ భూపతి చిత్రం

హైదరాబాద్, జూలై 30: ఘట్టమనేని కుటుంబం నుంచి హీరోగా పరిచయమైన జయకృష్ణ, ప్రముఖ నటి రవీనా టండన్ కుమార్తె రాషా తడాని జంటగా నటించిన ‘శ్రీనివాస మంగాపురం’ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆర్ఎక్స్ 100, మంగళవారం చిత్రాలతో గుర్తింపు పొందిన దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ చిత్రం ప్రేమ, యాక్షన్, కుటుంబ భావోద్వేగాల మేళవింపుగా రూపొందింది. తిరుపతి నేపథ్యంలో సాగే ఈ కథలో నగరానికి వచ్చిన శ్రీను (జయకృష్ణ) ప్రభావశీలి పెద్దిరెడ్డి (శ్యామ్) కుమార్తె మంగ (రాషా తడాని)ని ప్రేమిస్తాడు. ఆమె జీవితానికి సంబంధించిన ఓ రహస్యం వెలుగులోకి రావడంతో కథ ఆసక్తికర మలుపులు తిరుగుతుంది. శ్రీను గతం, మంగతో ఉన్న అనుబంధం, వెంకటప్పయ్య (మోహన్ బాబు), లక్ష్మీపతి మధ్య జరిగిన సంఘటనలు చివరికి కథను భావోద్వేగభరిత క్లైమాక్స్‌కు తీసుకెళ్తాయి. సినిమా తొలి భాగం ప్రేమకథ, పాటలు, కామెడీతో సాగగా.. ద్వితీయార్ధంలో ఫ్లాష్‌బ్యాక్, యాక్షన్, ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. దర్శకుడు అజయ్ భూపతి ఈసారి ప్రయోగాల కంటే కమర్షియల్ అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. కథలో కొత్తదనం తక్కువగా ఉన్నప్పటికీ, భావోద్వేగాలు, యాక్షన్ సన్నివేశాలు సినిమాకు బలం చేకూర్చాయి. హీరో జయకృష్ణ తొలి చిత్రంలోనే మంచి నటన కనబరిచారు. ముఖ్యంగా భావోద్వేగ, యాక్షన్ సన్నివేశాల్లో ఆకట్టుకున్నారు. రాషా తడాని తన అందం, అభినయంతో ప్రేక్షకులను మెప్పించారు. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మోహన్ బాబు తన అనుభవంతో పాత్రకు బలం చేకూర్చగా, శ్యామ్ ప్రతినాయకుడిగా ఆకట్టుకున్నారు. బ్రహ్మాజీ, నరేష్‌ల హాస్య సన్నివేశాలు వినోదాన్ని పంచాయి. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ అందించిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరో ప్రధాన బలంగా నిలిచాయి. నిర్మాణ విలువలు, ఛాయాగ్రహణం కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. మొత్తంగా ‘శ్రీనివాస మంగాపురం’ ప్రేమ, యాక్షన్, భావోద్వేగాలతో కూడిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరిస్తోంది. కొత్త జంట జయకృష్ణ--రాషా తడాని నటన ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

దృశ్యకావ్యంలా ‘రామాయణ’ ట్రైలర్

హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో నితీశ్ తివారీ మాయాజాలం..

రణ్‌బీర్, యశ్ పాత్రలు హైలైట్

ముంబై, జూలై 30: భారతీయ ఇతిహాసాల్లో చిరస్థాయిగా నిలిచిన రామాయణం మరోసారి వెండితెరపై అద్భుత దృశ్యకావ్యంగా ఆవిష్కృతం కానుంది. దర్శకుడు నితీశ్ తివారీ తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘రామాయణ’ ట్రైలర్ విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అత్యున్నత నిర్మాణ విలువలు, హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్, అద్భుత గ్రాఫిక్స్‌తో రూపొందిన ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను మరింత పెంచింది. ట్రైలర్ ప్రారంభంలో ‘దేవలోకం.. భూలోకం.. పాతాళలోకం.. ముల్లోకాల్లో ఇక ఒక్కటే సామ్రాజ్యం.. రావణ రాజ్యం’ అనే డైలాగ్‌తో రావణుడి పాత్రలో యశ్‌ను పరిచయం చేశారు. అనంతరం ‘చీకట్లను పారదోలేందుకు ప్రతి యుగంలోనూ శ్రీమహావిష్ణువు అవతరిస్తాడు’ అనే నేపథ్యంతో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్‌ను చూపించిన తీరు ఆకట్టుకుంటోంది. ప్రశాంతత, ధర్మనిష్ఠను ప్రతిబింబించే రాముడిగా రణ్‌బీర్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతారాముల కల్యాణం, వనవాసం, రావణుడితో యుద్ధం వంటి కీలక ఘట్టాలను విజువల్ వైభవంతో ఆవిష్కరించారు. సాధారణంగా మృదుస్వభావిగా కనిపించే సీతాదేవిని ఈ చిత్రంలో ఖడ్గం పట్టిన యోధురాలిగా చూపించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. పుష్పక విమానాన్ని భారీ తామరపువ్వు ఆకారంలో డిజైన్ చేయగా, జటాయువు, ఐరావతం వంటి పాత్రలను అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో తీర్చిదిద్దారు. హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవీ దూబే, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, కైకేయిగా లారా దత్త, మంథర పాత్రలో శీబా చద్దా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. శూర్పణఖ పాత్రలో రకుల్ ప్రీత్ సింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, వివేక్ ఒబెరాయ్ విద్యుజ్జిహ్వ పాత్రలో కనిపించారు. పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించడం ప్రేక్షకులకు సర్‌ప్రైజ్‌గా మారింది. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు హాన్స్ జిమ్మర్, ఆస్కార్ విజేత గీ.ఆర్. రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. విజువల్స్‌కు తగ్గట్టుగా సంగీతం ప్రతి సన్నివేశాన్ని మరింత భావోద్వేగంగా మలిచింది. దాదాపు రూ.4,000 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ గీడాది దీపావళి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రామానంద్ సాగర్ రూపొందించిన రామాయణం ధారావాహికలో రాముడిగా నటించిన అరుణ్ గోవిల్ ఈ చిత్రంలో దశరథుడి పాత్రలో కనిపించనున్నారు. ట్రైలర్ విడుదలతో భారతీయ సినీ ప్రేక్షకుల్లో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.



ఆస్ట్రేలియా వెకేషన్‌లో త్రిష..

ఒక్క క్యాప్షన్‌తో మొదలైన చర్చ

స్టార్ హీరోయిన్ త్రిష తాజాగా చేసిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ధనుష్‌తో మ–రోసారి వెంకీ అట్లూరి.. ధనుష్ ‘సార్’ సినిమాతో తెలుగు, తమిళ ప్రేక్షకులను ఒకేసారి ఆకట్టుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి. తమిళ స్టార్ ధనుష్‌తో మరోసారి జతకట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని వెంకీ అట్లూరి తాజాగా ఓ ఇంటర్వ్యూలో అధికారికంగా వెల్లడించారు. ఇప్పటికే ధనుష్‌కు కొత్త కథకు సంబంధించిన స్టోరీ లైన్ వినిపించానని, ఆయన నుంచి సానుకూల స్పందన లభించిందని వెంకీ తెలిపారు. ప్రస్తుతం తాను తెరకెక్కిస్తున్న ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ సినిమా విడుదలైన తర్వాత ఈ కథపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టి ప్రీ–ప్రొడక్షన్ పనులు ప్రారంభిస్తానని చెప్పారు. ఈసారి ధనుష్‌ను పూర్తిగా భిన్నమైన అవతారంలో చూపించబోతున్నట్లు వెంకీ అట్లూరి వెల్లడించారు. ‘పోలీస్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమా రూపొందనుంది. కథలో బలమైన భావోద్వేగాలతో పాటు కమర్షియల్ అంశాలకు కూడా పెద్దపీట వేయనున్నాం’ అని చెప్పారు. గతంలో వెంకీ అట్లూరి దర్శకత్వంలో ధనుష్ నటించిన ‘సార్’ (ఖుఖ్ష్టఱ) చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా మంచి విజయాన్ని సాధించింది. ముఖ్యంగా విద్యా వ్యవస్థ నేపథ్యంలో రూపొందిన ఆ చిత్రం ఇద్దరికీ మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఇప్పుడు అదే విజయవంతమైన కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుండటంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నటీనటులు, నిర్మాత, షూటింగ్ షెడ్యూల్ వంటి పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం వెంకీ అట్లూరి ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ పనులతో బిజీగా ఉండగా, ధనుష్ కూడా వరుస చిత్రాలతో తీరిక లేకుండా ఉన్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న కొత్త సినిమా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,**
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com